# సర్దార్ సర్వాయి పాపన్న



బహుజన విప్లవ వీరుడు

## కొంపెల్లి వెంకట్ గౌడ్

# ఆనాటి సమాజ స్థితిగతులు

ప్రపంచ చరిత్రలో యే రాచరిక వ్యవస్థలోనైనా బలమున్నవాడిదే రాజ్యం. బలమున్నవాడిదే న్యాయం, చట్టం. ప్రజాభిప్రాయానికి స్థానం లేదు. ప్రజలకు వాక్కులేదు. ముఖ్యంగా ఇండియా ఉపఖండాన్ని పాలించిన అన్ని రాచరిక వ్యవస్థల్లోనూ యిదే పద్ధతి కొనసాగింది. గోల్కొండ కుతుబ్‌షాహీ వంశంలో చివరివాడైన సుల్తాన్ అబుల్‌హసన్ తనాషా రాజ్యాన్ని కోల్పోయాడు. మొగలులు గోల్కొండతో పాటు తెలుగు ప్రాంతాన్నంతటిని వశపరచుకున్నారు. క్రీ.శ. 1635-36లో అహ్మద్‌నగర్, క్రీ.శ.1687గోల్కొండ మొగలుల ఆధీనంలోకి వచ్చాయి.

రాజ్యవిస్తరణకై ఔరంగజేబు దక్కన్‌పై దాడి చేసేనాటికి అంటే క్రీ.శ. 1656 నాటికి గోల్కొండ సిరిసంపదలతో పంటలు, ధనరాసులతో విరాజిల్లుతున్నది. ఔరంగజేబు గోల్కొండను దోచుకోవాలనుకోవడానికి ప్రధానకారణం యిక్కడున్న అశేషమైన ధనసంపద. నిత్యం జరిగే మరాఠా తిరుగుబాట్ల వలన మొగలు సైన్యం క్షీణించింది. ఔరంగజేబు తన సైన్యాన్నిబలోపేతం చేసుకోవానికి, ఆయుధాలు సమకూర్చుకోవడానికి ధనం కావలసి వచ్చింది. మొగలుల ఆధీనంలో వున్న అన్ని ప్రాంతాలకంటే గోల్కొండ ప్రాంతం సుభిక్షంగా వున్నది. మొదట గోల్కొండ ప్రాంతంలో వున్న అశేషమైన సంపదకు ఆకర్షితుడైన ఔరంగజేబు తన కుతంత్రములతో గోల్కొండ రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయపూనుకున్నాడు. తన సైన్యంతో దాడులు కొనసాగిస్తూ అంతర్గత కలహాలు సృష్టించాడు.మొగల్‌పాలకులు యేలిన అన్ని కాలాలలోనూ, కుట్రలు, కుటుంబ హత్యలు ప్రధాన భూమిక పోషించాయి. పోరాటపటిమ కంటే కుట్రపూరిత చర్యల వల్లనే యెక్కువ మంది పాలకుయ్యారు. యిదే పద్ధతిని అనుసరించాడు ఔరంగజేబు.గోల్కొండ మీదకి దాడికి వస్తూ ఔరంగజేబు తానెన్నడూ చూడని దృశ్యాన్ని చూసి ఆశ్చర్యానందాలతో పులకించి తండ్రికి వుత్తరం రాసుకున్నాడు.

"గోల్కొండ ప్రాంతం అనేక పరిశ్రమలు, సుభిక్షమైన పంటపొలాలతో తులతూగుతున్నది. గోల్కొండ రాజధాని హైదరాబాద్ నగరం వజ్రాలకు ప్రసిద్ధిగాంచింది. వొక్క ఆసియాకే కాదు మొత్తం ప్రపంచానికే యిది ప్రధాన కేంద్రం. అనేక రకాలైన పరిశ్రమలతో వున్న యీ నగరంలో విదేశీవర్తకులు వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. చేపలు గంతులేసే నదులతో, పలు రకాల పంటలతో ఈ ప్రాంతం అలరారుతున్నది. చేతి వృత్తులు ఉచ్ఛదశలో వున్నాయి. బంగారం, వజ్రాలు నిల్వలు యూరప్‌కు ఎగుమతి అవుతున్నాయి. అడవులు యీ రాజ్యానికున్న అదనపు సంపద. కల్లు, పొగాకు పెద్దమొత్తంలో ధనాన్ని తెచ్చిపెడుతున్నవి. యింకా యేం రాయగలను యీ అందమైన నగరాన్ని గురించి. విశాలమైన పంటపొలాలు, స్వచ్ఛమైన గాలి మార్గ మధ్యలో చూశాను. గ్రామాలకు వెన్నంటి వున్న నదులు సెలయేరులు, కాలువలు ప్రతిచోట దర్శనమిస్తున్నాయి.సాగుచేయని భూమి అంటూ కనిపించని యీ రాజ్యాన్ని మొగలుసామ్రాజ్యప్రాంతాలతో పోల్చలేము."

ఔరంగజేబు స్వయంగా తన తండ్రికి రాసుకున్న యీ వర్ణనలను గమనిస్తే గోల్కొండ ప్రాంతం యెంత సుభిక్షంగా వున్నదో అర్థం చేసుకోవచ్చు. కేవలం యిక్కడ సంపదను దోచుకోవాలనే వుద్దేశంతో వచ్చిన ఔరంగజేబు మొత్తం కనిపించిన సంపదనంతా దోచుకుని సుభేదారులను నియమించి తిరుగు ముఖం పట్టాడు. దీనితో సుబేదారుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. సుభేదారులు, స్థానిక దొరలు,భూస్వాములకు అధికారాలు అంటగట్టి పన్నుల వసూళ్ళతో ప్రజలను దోచుకున్నారు. ప్రజలను అనేక విధాలుగా హింసించారు. నిత్యం వేధింపులు గురిచేశారు. దోపిడీకి అలవాటు పడ్డ మొగలు పాలకులు రాజ్యపాలనపై యే మాత్రం దృష్టి సారించలేదు.

"క్రీ.శ. 1687-1724 మధ్య కాలంలో తెలుగు ప్రాంతంలో కేంద్రీకృత రాజ్య పాలన లేదు. మరాఠా తిరుగుబాట్ల వలన మొగలు పాలకులు యిక్కడ స్థిరంగా వుండలేకపోయారు. తెలుగు ప్రాంతమంతా అరాచక వక్తులు, మొగలు సైన్యాధికారుల మధ్య ఛిద్రమై వున్నది. యిది తెలుగు ప్రాంతమంతా నెలకొని వున్న రాజకీయ వ్యవస్థ."

మొగలుల రాకతో గోల్కొండ ప్రాంతం క్షీణించడం ప్రారంభమైంది. తరచూ జరిగే యుద్ధాల వలన పరిశ్రమలు, వ్యాపారం దెబ్బతిన్నాయి. పాలనావ్యవస్థ లంచాలతో, మోసాలతో కూడుకొని అరాచకాలు ప్రబలాయి. యెంతో ప్రశాంతంగా జీవితాన్ని గడుపుతున్న యిక్కడి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. మొగలుల పరిపాలన క్రీ.శ. 1687 నుండి క్రీ.శ. 1724వరకు సుమారు 37 సంవత్సరాలు తెలుగు ప్రాంతమంతా కొనసాగింది. యీ 37 సంవత్సరాల కాలంలో పరిపాలన అంతా సుబేదారుల చేతుల్లో నడిచింది. బి.ఎన్. శాస్త్రి మాటలలో.

"ఈ కాలమున తురుష్కుల దురంతములను చవిచూడని గ్రామమాంధ్రదేశమున లేదనిన అతిశయోక్తి కాదు. మతావేశపరులైన ముస్లిం సైనికులు, పరిపాలకులు, మతమౌఢ్యమున్న మహ్మదీయులు హిందూదేవాయాలను పడగొట్టించారు. హిందూ స్త్రీలను చెరబట్టినారు. వైదికాచార వ్యవహారములను మంటగలిపినారు.హైందవ సంస్కృతినవహేళన పరిచినారు. అనేక దేవాలయములందున్న శిల్పసంపద ఛిన్నాభిన్నమైనది. అపురూప సౌందర్య విలసితములగు విగ్రహములు కనుముక్కులు, చేతులు, పాదములు కోల్పోయి వికారరూపమును పొందినవి. ముస్లిం పాలకులు, సైనికులు, నాయకులు గుళ్ళు గోపురములను పడగొట్టించి వాటి స్థాననమున మసీదులు, దర్గాలు, ఈద్‌గాలు నిర్మించినారు.ఆంధ్రదేశముతమ స్వంత ఆస్తియని భావించి, ప్రజలను పీడించి, దోపిడీలను సాగించి, పంటపొలములను విధ్వంసమొనర్చి రాక్షసపాలన మొనర్చినారు. నాట ప్రజలుకరువు కాటకముల ననుభవించినారు. దోపిడీలకు గురైనారు. ధన, మాన,ప్రాణములనుకోల్పోయినారు. ప్రాణములరచేత పెట్టుకొని ఎప్పుడే యుపద్రవము సంభవించునోయని బిక్కుబిక్కుమని జీవితమును గడిపినారు. దుష్టపాలనము, ప్రకృతివైపరీత్యములు, దండయాత్రలు, యుద్ధములు, అధిక పన్నులు, పిండారీల దురంతములు, ముస్లింల దౌర్జన్యకాండ తెలుగు ప్రజలను కృంగదీసినవి."

అప్పటివరకు యెంతో సుభిక్షంగా జీవించిన ప్రజలకు ఔరంగజేబు దోపిడీ అనంతరకాలం కూడా కలసి రాలేదు. అతివృష్టి, అనావృష్టి మధ్య ప్రజలు నలిగిపోయారు. దుదృష్టము ప్రజలను వెంటాడింది. ఔరంగజేబు గోల్కొండ మీద చేసిన దాడి తరువాత వర్షాలు లేక ప్రజలు కరువుతో విలవిల్లాడారు. వెంటనే నెలల తరబడి కురిసిన వర్షాల వలన గోల్కొండ ప్రాంతమంతా జలమయమైంది. కరువు విలయతాండవం చేసింది.

"హైదరాబాద్ నగరం మైదానాలు, ఇళ్ళు, నదులు శవాలతో నిండిపోయి వున్నది. మొగలు సైన్యం కూడా దీనికి లోనయ్యింది. యెడతెరిపిలేకుండా కురిసిన వర్షంవలన నీరంతా మానవ కళేబరాలతో కలిసిపోయినది. యిలా కొన్నినెలలు సాగింది. వర్షం వెలిసిన అనంతరం ముకలు తెల్లని మంచుగుట్టల్లా కనిపించాయి."

యింతటి విపత్తును అనుభవించిన ప్రజలు కోలుకోకముందే మొగలు సైన్యాలు స్వైరవిహారం చేయసాగాయి. వీరి అక్రమాలకు దౌర్జన్యాలను అడ్డులేకుండా పోయింది. యిలాంటి పరిస్థితిని కళ్ళారచూసి, అనుభవించి, బీదప్రజల రక్షణకోసం తన జీవితాన్నే త్యాగం చేశాడు పాపన్న. అణగారిన ప్రజలకు అండగా నిలిచి వారికి అప్పుడుగా నిలిచి స్వతంత్రంగా దాదాపు 20 యేళ్ళు పాలించాడు. ప్రజల మద్దతుతో క్రూరమైన మొగలు సైన్యాలతో పోరాడి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకున్నాడు. గోల్కొండ కోటను అధిష్టించి యెక్కువకాలం కొనసాగలేకపోయినా, అణగారిన కులంలో పుట్టి, సాటికులాల మద్దతుతో వీరోచితమైన పోరాటాలతో రాజ్యాధికారాన్ని చేపట్టిన పాపన్నచరిత్రను వక్రీకరించి రాయడం చారిత్రక ద్రోహం.

# పాపన్న తిరుగుబాటు తత్వానికి మూలాలు

క్రీ.శ. 1650 ప్రాంతంలో అణిచివేతకు గురిఅవుతున్న గౌడ్ కులంలో పుట్టిన పాపన్నబాల్యంలో పశువుల గాస్తూ తన జీవించాడు. యుక్తవయసు రాగానే తల్లికోరికను గౌరవించి కల్లుగీశాడు. ఆనాటి సాంఘిక వ్యవస్థ ప్రకారం వొక సామాన్య కుటుంబంలో పుట్టిన పాపన్నలో రాజ్యకాంక్ష యెలా యేర్పడింది? యితర యే కులం వారికీ యింతటి కాంక్ష యెందుకు వుదయించలేదు? పాపన్నలో రాజ్యకాంక్ష యేర్పడడానికి ప్రధాన కారణం వొకటి కుటుంబ జీవనవిధానం, రెండు ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు. యీ రెండు కారణాలను పరిశీలించినప్పుడే పాపన్న యెలా వీరుడయ్యాడో, రాజ్యం చేపట్టి రాజు యెలా కాగలిగాడో అర్థమవుతుంది. పాపన్న ముత్తాత, తాతల కాలంలో మొదలై తండ్రుల కాలానికి కుటుంబంలో శైవమతం బాగా బలపడింది. వీరు నిత్యం శైవమతాంబీకులై, పూజలు, వ్రతాలతో మనిగి నిష్టాగరిష్ట జీవితాన్ని అనుసరించేవారు.పాపన్న వంశమే కాదు దాదాపు కింది కులాల ప్రజలందరూ శైవానికి ఆకర్షించబడ్డారు. తర్వాత కాలంలో ఐచ్ఛికంగా మతాచారాలను ఆచరించడం మొదలుపెట్టారు. అణగారిన కులాలకు సంబంధించిన యెక్కువమంది శైవమత సంప్రదాయాలను పాటించారని చరిత్ర తెలియజేస్తున్నది. అందులో భాగంగానే పాపన్న పూర్వీకులు కూడా శైవమత ఆచారాలను పాటించారని మనకు జానపద గాయకుల వలన తెలుస్తున్నది. పాపని తాత ముత్తాతల నుండి అంతా శివభక్తులే. నియమ నిష్టాగరిష్టులే. గంగ స్నానం చేసి పచ్చనాకుల్లో తినేవారు."

"పారేనీళ్లలో కాళ్లు కడగరు - తాటి రేకుల్లో నీళ్లు తాగరు
తాంబాకునే సుట్టదాగరు - కొసువాసన మురుకసూడరు
కల్లు సరాఉలసలే దాగరు - నిండ యిభూతి పెట్టుకుంటరు
మడిబట్టలతో వంట చేత్తరు - తడిబట్టలతో వంట చేత్తరు
కాటిరేవుని కొలుసుకుంటరు - జేజెబువ్వలు పెట్టుకుంటరు
నీతివొక్కటి దండిగున్నది - గౌండ్లకులానికి బరుకతున్నది"

ఈ రకమైన వర్ణనలను బట్టి గౌడ్‌లు యెంతటి భక్తి పరమైన ఆచార వ్యవహారాలలో మునిగి వున్నారో అర్థం చేసుకోవచ్చు. యివే కాకుండా రోజువారీ జీవితంలో శైవానికి యిచ్చిన ప్రాధాన్యతను గురించి ఒక జానపద చరిత్రకారుడు యిలా తెలిజేస్తున్నాడు.

గౌడ్‌లు మధు, మత్స్య, మాంసాహారాలు ముట్టేవాళ్లేకాదు. శుద్ధశాఖాహారులే.అయినా కలెకూర, చామగడ్డ, ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ వంటి వాటి వాసన కూడా చూసేవాళ్లు కాదు. పారేనీళ్లలో ముఖం కడుక్కోలేదు. ఈతపుల్లతో పండ్లుతోమలేదు. తాటి రేకుల్లో నీళ్లు త్రాగలేదు.స్త్రీలు, పురుషులు అందరూ లింగం ధరించేవాళ్లు. వయోభేదం లేకుండా అందరూ భస్మం పూసుకొనే వాళ్లు. కత్తికి లింగం, మోకుకు లింగం, కల్లు కుండకు, కావడిబద్దకు, వండు కుండకు, వార్చేశిబ్బికి, కలిపేతెడ్డుకు, కూరాడుకుండకు, సాదిన పిల్లికి, పెంచిన కుక్కకు, ఆవుకు, ఎద్దుకు, పాడిగేదెకు ఒకటేమిటి? ఇంట్లో వున్న అన్ని జీవులకు, నిర్జీవలకు లింగం వుండి తీరాల్సిందే."

గౌడ్‌కులంలోని కుటుంబాలన్నీ యిదే సంప్రదాయంతో జీవించాయి. యిలా సాగిన శైవం కాలానుగుణంగా సంభవించే మార్పులకు తట్టుకొని నిలబడలేకపోయింది. ఈ క్రమంలో వైష్ణవం బలపడింది. పాపన్న పుట్టేనాటికి అంటే క్రీ.శ. 1650 నాటికి శైవం క్షీణించి వైష్ణవం క్రమంగా బలపడుతున్నది. అయితే వైష్ణవ సంప్రదాయం అణగారిన కులాల్లో అంతగా చొరబడలేకపోయింది. అణగారిన కులాలను దూరంగా వుంచింది. పాపన్న బాల్యంపై యీ ' పరిణామం' ప్రభావం చూపించింది.

ఒక్క కొడుకు కావడంతో తల్లి సర్వమ్మ పాపన్నను గారాబంగా పెంచింది. తండ్రి లేక పోవడంతోకొడుకును ప్రయోజకుడిని చేయడానికి సర్వమ్మ అన్ని విధాలా కృషిచేసింది. పూర్వీకులు కష్టార్జితాన్ని కొడుకు భవిష్యత్తు కొరకు కాపాడుతూ వచ్చింది. తల్లి పెంపకంలో స్వేచ్ఛగా పెరిగిన పాపన్నలో సహజంగనే నూతన భావాలు పొదుకున్నాయి. తాము చేసే కులవృత్తికి, పాటించే సంప్రదాయాలకు మధ్య ఎంత మాత్రం పొంతన లేకుండా పొవడం పాపన్న గమనించాడు. క్రమక్రమంగా మతాచారాలపై వ్యతిరేకత ఏర్పడింది. తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న సంప్రదాయ జీవితాన్ని పాపన్న వ్యతిరేకించాడు. కల్లుతాగడం, మాంసం తినడం అలవాటు చేసుకున్నాడు. పాపన్న ప్రవర్తన కుటుంబాన్ని కలవరపెట్టింది. తరాలుగా ఆచరిస్తూ వస్తున్న శైవ సంప్రదాయం కట్టుబాట్లు మంటగలిపోయాయని భవించారు.

పాపన్న ప్రవర్తిన్న తీరుకు సర్వమ్మ బాధపడింది. కొడుకును యెల్గాగైనా దారిలో పెట్టాలని నిర్ణయిచుకున్నది. అప్పటికే పాపన్న సాటి అణగారిన కులాలకు చెందిన స్నేహితులతో తిరగడం ప్రారంభించాడు. వీరిలో మాదిగ, మాల, చాకలి, మంగలి, కుమ్మరి, ముత్రాసి, దూదేకులవంటి వారున్నారు. చాకలి సర్వన్న, మంగలలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పేరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్ మీర్ సాహెబ్ వంటి పాపన్న ప్రధాన అనుచరులు. వీరందరితో కలిసి తాళ్లల్లో ఈదులల్లో కల్లుతాగుతూ లోకం సంగతులు చర్చించేవాడు. ఈ రకమైన స్వేచ్ఛా పూరితమైన జీవితాన్ని గడిపేవాడు పాపన్న.

సంప్రదాయ మతాచారాలకు కట్టుబడి వుండే తల్లి సర్వమ్మ కొడుకు చెడిపోతున్నాడని భావించేది. ఈ క్రమంలో కొడుకును తాళ్లెక్కమని కోరింది. పాపన్న అందుకు అంగీకరించలేదు. తల్లికొడుకుల మధ్య కొంత ఘర్షణ జరిగింది. ఈ విషయంలో - కొడుకు తన మాట వినకపోవడంతో తల్లి సర్వమ్మ కుమిలి పోయింది. వీరిద్దరిమధ్య కొంత అగాధం ఏర్పడింది. చివరికి పాపన్న తల్లి మీద వున్న గౌరవంతో తనకు యిష్టంలేకపోయినా తాళ్లెక్కడం మొదలుపెట్టాడు. దీంతో పాపన్న స్వేచ్ఛాయుతమైన జీవితానికి తాత్కాలికంగా దూరమయ్యాడు. యింట్లో మతాచారాలు వొక పక్క తనకు

యిష్టం లేకపోయినా తాళ్లెక్కవలసి రావడం మరోపక్క పాపన్నను వేధించాయి. తాళ్లెక్కడంలో వున్నకష్టం పాపన్నకు తెలుసు. ముందు చెట్టు గీతకు అనువుగా వుందో లేదో చూసుకోవాలి. గీతకు అనుకూలంగా మలచుకొని కొన్ని రోజులు పుట్టగీయాలి. తర్వాత లొట్లువేయాలి. రోజుకు రెండుసార్లో మూడుసార్లోయెక్కిదిగాలి.తీరాగీసిన కల్లు పారుతుందని నమ్మకముండదు.తాళ్ళెక్కడమంటే గౌడ్‌కు యెక్కిన ప్రతిసారీ మృత్యువుతో పోరాటం చెయ్యడమే. యింత చేసినా పన్నులు కట్టవలసి రావడం , దొరలకు అణిగి బతకడం పాపన్నకు యిష్టంలేదు. కులవృత్తిలో చేసే పోరాటమే పాలకులపై చేస్తే రాజు కావచ్చని వూహించుకున్నాడు రాజ్యాన్ని నిర్మించి ప్రజల కష్టాలు తొలగించాలని కలలుకన్నాడు. యెలాగైనా యీ కట్టుబాట్ల నుండి బయటపడాలని తలపోశాడు. తిరుగుబాటు చేశాడు.

ఆనాటి ఆర్థికవ్యవస్థలో కల్లు ప్రధాన పాత్ర పోషించేది. కల్లుమీద వచ్చే ఆదాయంతోనే రెవిన్యూ ఆధారపడి వున్నది. మిగతా పంటలపై వేసే పన్నుల కంటే కల్లుమీద పన్నులు యెక్కువగా వుండేవి. దీంతో గౌడ్‌లపై స్థానిక పాలకుల అరాచకాలు అధికంగా వుండేవి. ప్రాణాలకు తెగించి వృత్తిచేస్తే వచ్చిన ఆదాయంతో యెక్కువ భాగం పన్నుల రూపంలో చెల్లించాల్సి రావడం గౌడ్‌లను విపరీతంగా బాధించేది. యిటువంటి పరిస్థితులను ప్రత్యక్షంగా గమనించిన పాపన్నకు కల్లు గీయడం యిష్టం లేక పోయింది. ఆనాటి నుండే యీ రకమైన శ్రమ దోపిడీని సహించలేకపోయాడు. యీ కారణం వల్లనే కల్లుగీయడంపై ఆసక్తి కనబరచలేకపోయాడు. పాపన్న తలంపుకు సహకరించేవిగా ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు నెలకొని వున్నాయి. వృత్తిపరంగా, ఆర్థికంగా స్వయంపోషకంగా బతుకుతున్నవారి జీవితాల్లో పాలకుల వేధింపులు అధికమయ్యాయి. జీవితాలకు రక్షణ లేకుండా పోయింది. అణగారినకులాలకు ప్రాణభయం వెంటాడేది. స్థానిక దొరలు, జమీందారులు, సుభేదారుల దోపిడీలు పెరగసాగాయి. ఇటువంటి పరిస్థితులను ప్రత్యక్షంగా అనుభవించిన పాపన్నలో తిరగబడే మనస్తత్వం ఏర్పడింది. ఇంతటి విపత్కర పరిస్థితుల నుంచే పాపన్నలో రాజ్యాకాంక్ష యేర్పడింది. అందువల్లనే తల్లితో-

ఈదులు గీస్తూ ఈండ్రవాడు - కల్లుగట్టితే గవండ్లవాడు
కత్తిబడితే మేదరవాడు - కుండబడితే కుమ్మరివాడు
మొనగాడి చుట్టమొచ్చునా - పాలెగాడి చట్టమొచ్చునా" అని వాదించాడు.

తల్లి మీద వున్న గౌరవంతో కొంతకాలం గొడ్లకాయడం, వయసువచ్చిన తర్వాత తాళ్లెక్కడం చేసినా, యీ పనులు పాపన్నను ఆకర్షించలేకపోయాయి. కనీసం మానసిక ప్రశాంతిని చేకూర్చలేక పోయాయి.

పాపన్న వొకరికి తలవొంచి బతకడం, బానిసగా యిష్టం లేని పనులు చేయడం సహించలేక పోయాడు. యీ విధమైన దుర్భరస్థితి నుంచి వొక నిర్ణయానికొచ్చి తల్లితో అన్నాడు.

"కొడ్తే గోల్కొండ కొట్టాలే - నెల్లూరు బస్తీలు కొట్టాలే
బందరు బస్తీ కొట్టాలే - బచ్చీనపెట్టీలు కొట్టాలే
మైసూర్ జిల్లాలు కొట్టాలే"

జానపదుల పాటల్లో వొదిగిన యీ విషయాలు పాపన్న నిశ్చయాన్ని తెలియజేస్తున్నాయి. ధనమున్న ప్రాంతాల్ని కొల్లగొట్టి, ధనాన్ని, సైన్యాన్ని సమీకరిచాడు. తన ప్రజలకు రక్షణ యివ్వాలనుకున్నాడు. యెంతో మథనపడి, ప్రాణాలను సైతం బలికోరే పంతం పట్టిన పాపన్న తాను అనుకున్నది సాధించాలనుకున్నాడు.

# పాపన్న వీర విహారం

స్వతంత్ర ఆలోచనలు కలిగిన పాపన్న కల్లు గీస్తూ, పశువులు గాసేవాడు. అప్పటికీ తాను గడుపుతున్న జీవితంపై అసంతృప్తితో యెన్నో ఆలోచనలు చేయసాగాడు. ఆలోచనల బంధవిముక్తి కోసం పరితపించసాగాడు. రోజు మాదిరిగానే తాళ్లెక్కి కల్లును తల్లికి అప్పజెప్పిన అనంతరం పశువులను తోలుకొని అడవికి బయలుదేరాడు. పశువులను పచ్చికపై వదిలి వొక చెట్టుకింద పడుకొని ఆకాశం వైపు చూస్తూ ఆలోచన చేయసాగాడు. గడిపిన జీవితం మనసులో పొడచూపుతున్న భావాలకు, బాహ్యప్రపంచంలో తన జీవితానికి యే మాత్రం పొంతన లేకుండా పోవడాన్ని పాపన్న సహించలేక పోయాడు. "తాను యేదో ఘనకార్యం సాధించడానికి పుట్టాడే కాని యిలా యెదుగూ బొదుగూ లేకుండా అణిగి బతకడానికి కాదు. ఈ బానిస బతుకు నుండి విముక్తి పొందాలనుకున్నాడు. గొప్ప పని తలపెట్టి తల్లికి, తన జాతికి పేరు తేవాలనుకున్నాడు. ఇలాంటి ఆలోచన, భావ సంఘర్షణల మధ్య అర్థాంతరంగా పశువులను తోలుకుని యింటి ముఖం పట్టాడు. పాపన్న నడిచే దారిపొడుగునా యిదే ఆలోచనలతో సతమతమయ్యాడు. యిప్పుడు పాపన్న బాహ్యప్రపంచాన్ని పట్టించుకొనే స్థితిలోలేడు.

కల్లు అమ్ముకొని సేదదీరుతున్న తల్లి సర్వమ్మకు పొద్దు గూగకముందే పశువులు ఇంటికి చేరడం ఆశ్చర్యం కలిగించింది. పశువుల వెనకే బరువెక్కిన ముఖంతో తూలుతున్నట్టుగా వస్తున్న పాపన్నను చూసి కలవరపడింది. ధైర్యసాహసాలకు వెనుదీయకుండా, ఎదిరించి మాట్లాడే తత్వం గల పాపన్నను మొదటిసారిగా యీ స్థితిలో చూసింది. కొడుకుకు యేమైందోనని సర్వమ్మ కలవరపడింది. తల్లి మనసు కీడు శంకించింది. తల్లిని అమితంగా ప్రేమించే పాపన్న తాను తాను తీసుకున్న నిర్ణయం, పట్టిన శపథం ఆమెను బాధింస్తుందని తెలిసి కూడా తాను బంధ విముక్తుడు కావడానికి వుద్యుక్తుడయ్యాడు.

ఉద్వేగంతో తల్లిపాదాలపై పడ్డాడు. ఈ చర్యకు తల్లి భయకంపితురాలైంది. కొడుకు ప్రవర్తనకు సర్వమ్మ ఆందోళన చెందింది. పాపన్న కన్నీరు ధారాళంగా కన్నీరు కారుతుండగా "అమ్మా నేను యీ పని చేయలేను. నేను రాజునవుతాను, రాజ్యమేలుతాను." అన్నాడు. కొడుకు మానసిక స్థితిని గమనించిన సర్వమ్మ "వద్దురా పాపయ్యా అలాంటి మాటలు మాట్లాడకు, కులవృత్తిని మానకు. అదే మనకు జీవనాధారం"అన్నది. తల్లికి జీవితానుభవం వున్నది. సుభేదార్లు, ఫౌజుదార్లు, దొరలు దుర్మార్గులు, పైగా వీరందరూ రాజుల అడుగులకు మడుగులొత్తేవారే, సర్వమ్మ తురక సర్దారుల, దొరల దురాగతాలు ప్రత్యక్షంగా చూసింది. తన నిర్ణయాన్ని తల్లి నిరుత్సాహపరచడం పాపన్నకు నచ్చలేదు. తల్లి యెన్నో విధాల నచ్చజెప్పడానికి ప్రయత్నించింది. పాపన్న తాను తీసుకున్న నిర్ణయంలో మార్పులేదని తెగేసి చెప్పాడు. కొడుకుపై వాత్సల్యం, బతుకు భయం సర్వమ్మది. ఉన్నదాంట్లో గుట్టుగా బతుకుతున్న తమ జీవితానికి పాపన్న నిర్ణయం యెంత ప్రమాదకరమైందో తల్లి వూహించగలదు. గడుపుతున్న

జీవితంపై యేవగింపు , సాహసవంతమైన జీవితం, రాజ్యకాంక్ష పాపన్నను ఉన్మాద స్థితికి చేర్చాయి.

సర్వమ్మ కొడుకు నిర్ణయాన్ని మార్చడానికి అనేక విధాలుగా ప్రయత్నం చేసింది. పాపన్న తన ఆలోచన, ఆశయం సరైందేనని తల్లిని వొప్పించే ప్రయత్నంలో వాదనకు దిగాడు.

"తాళ్లెక్కితేమొస్తది? కల్లమ్మితేమొస్తది?
మనం రాజులమవుతామా? మన రాజ్యమొస్తుందా?
ధనవవంతులను కొట్టాలి! కోటలు కొల్లగొట్టాలి!
రాజును కావాలి! రాజ్యమేలాలి" అన్నాడు.

రెండు తరాల భావ సంఘర్షణల మధ్య పాపన్నదే పైచేయి అయ్యింది. రాజ్యకాంక్ష భావన పాపన్నను పునీతం చేసింది. రాజ్యంపట్టి రాజు కావడానికి సైన్యం కావాలి. ఆయుధాలు సమకూర్చుకోవాలి. అందుకోసం తల్లి దాచిన డబ్బివ్వమని అడిగాడు. కొడుకును రక్షించుకోవాలనే తలంపుతో డబ్బు ఇవ్వడానికి సర్వమ్మ నిరాకరించింది. పాపన్న తన నిర్ణయాన్ని మార్చుకొనే స్థితిలో లేడు. పాపన్న సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట. తన స్నేహితులతో నాటకమాడించి, మాయోపాయము చేత తల్లిని మేనమామల దగ్గరికి పంపే యేర్పాట్లు చేశాడు. ముందే రూపొందించుకున్న పథకం ప్రకారం సర్వమ్మ యెడ్లబండిపై ఊరు దాటగానే తల్లి దాచిన ధనాన్ని వెతికి చేజిక్కించుకున్నాడు. తిరిగి వచ్చిన తల్లికి ఈ విషయం తెలిసింది. పాపన్న ప్రవర్తనకు వొకవైపు దుఃఖిస్తూ మరోవైపు జరగబోయే ప్రమాదం నుంచి కొడుకును రక్షించుకోలేకపోతున్నాని విచారించింది సర్వమ్మ.

తల్లి దగ్గరనుంచి ధనాన్ని తీసుకున్న పాపన్న అణిచివేతకు గురవుతున్న సాటి కులాలకు చెందిన మాల, మాదిగ, చాకలి, మంగలి, కుమ్మరి, ముత్రాసి, సాలె, కురమ వంటి అణగారిన కులాలకు చెందిన తన స్నేహితులను వెంటబెట్టుకుని తాటి వనంలోకి దారితీశాడు. తానే స్వయంగా కల్లుతీసి మిత్రులకు పోస్తూ, తన ఆశయాన్ని తెలియజేశాడు. కొంత చర్చ జరిగిన తర్వాత స్నేహితుల అంగీకారం, సహకారం పొందాడు.

తన స్నేహితులను సమీకరించి చిన్న సైన్యాన్ని తయారుచేశాడు. తల్లి దగ్గర తీసుకొన్న ధనంతో సంప్రదాయ ఆయుధాలను సమకూర్చుకున్నాడు సాహసమే వూపిరిగా బతికే పాపన్నకు యుద్ధ తంత్ర విద్యలు అంతగా తెలియవు. అయినా ఆశయానికి అనుగుణంగా తన అనుచరులతో కత్తి, బల్లెం, బాణం, కర్ర వంటి ఆయుధాలను ఉపయోగించే పద్ధతులను సాధన చేశాడు. సైన్యంతో ఆయుధాలను ప్రతిభావంతంగా ప్రదర్శించిన నేస్తగాళ్లకు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించాడు. క్రమంగా తాను పెరిగిన తాటికొండ చుట్టుపక్కల గ్రామాలలో వున్న ధనవంతులను, జమీందారులను రహస్య పద్ధతుల ద్వారా కొల్లగొడుతూ ధనాన్ని సేకరించడం మొదలుపెట్టాడు. ధన సేకరణలో భాగంగా పాపన్న దాడులను విస్తరించి హుస్నాబాద్, జనగాం, షాపురం చుట్టుపక్కల వున్న ధనవంతులను భూస్వాములను దోచుకున్నాడు. ఈ ధనంతో మరింత సైన్యాన్ని, మెరుగైన ఆయుధాలను సమకూర్చుకన్నాడు. పాపన్న తన సైన్యంతో రహస్యంగా చేసే దాడులు క్రమక్రమంగా వెలుగులోకి వచ్చాయి.

దొరలు, భూస్వాములను యెదిరించి బహిరంగ దాడులు చేసే స్థాయికి యెదిగాడు. దానితో పాపన్న సాహసాలకు ఆకర్షితులై ప్రజలు సైన్యంలో చేరడం ప్రారంభించారు. దొరల పీడనవల్ల బాధలు పడుతున్న అణగారిన కులాలకు చెందిన ప్రజలకు పాపన్న రక్షణ యిచ్చాడు. పాపన్న సైన్యం రోజురోజుకు పెరగసాగింది. పన్నుల మీద పన్నులు వసూలు చేస్తూ, ప్రజలను పీడిస్తున్న దొరలకు రాబడి తగ్గడంతో వారి దృష్టంతా పాపన్న వైపు మళ్లింది. పాపన్న సామాన్యుడు కాదని గ్రహించిన వెలమదొరలు, జమీందరులు యెలాగైనా బంధించి అంతమొందించాలని నిశ్చయించుకున్నారు. తన వేగుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న పాపన్న వున్న పరిస్థితిల్లో ప్రత్యక్షంగా యెదుర్కొనే శక్తిచాలక తన సైన్యానికి ఆజ్ఞలు జారీ చేసి రహస్య జీవితంలోకి పోయాడు.

పొలాస వెలమ జమీందారు వెంకట్రావు వద్ద మారువేషంలో కొలువు కుదిరాడు. జమీందారుల, భూస్వాముల పన్నాగాల నుంచి తనను తాను రక్షించుకోవడానికి యీ రహస్య జీవితాన్ని పాపన్న యెంచుకున్నాడు. కొంతకాలం వెలమ జమీందారు వెంకట్రావు దగ్గర నమ్మకంగా పనిచేసి అతని ప్రధాన అనుచరునిగా ఎదిగాడు. తెగువ, ధైర్య సాహసాలను ప్రదర్శించి పాపన్న వెంకట్రావును ఆకట్టుకున్నాడు. రహస్య జీవితాన్ని కొనసాగిస్తున్న పాపన్న అక్కడే చాలా కాలంగా పని చేస్తున్న హన్మంతుకు దగ్గరయ్యాడు. కొద్ది కాలంలోనే హన్మంతు పాపన్నకు మంచి మిత్రుడయ్యాడు. వెంకట్రావు దగ్గర పని చేస్తున్న హన్మంతు మరికొందరు మిత్రులతో తిరిగి పొలాస చుట్టుపక్కల నున్న జమీందారులను రహస్యంగా దోచుకోవడం మొదలుపెట్టాడు. యిటువంటి రహస్య దాడులు కొంత కాలం సాగాయి. రహస్య జీవితంలో వుండి కూడా పాపన్న మరికొంత ధనాన్ని కూడగట్టాడు. యిది గమనించిన దొరలు పాపన్నను గుర్తించి పొలాస జమీందారుకు రహస్య సమాచారం అందించారు. ఆ జమీందారు పాపన్నను అతని అనుచరులను ఖైదు చేశాడు. అప్పటికే జమీందారు వెంకట్రావు వద్ద అనేకమంది అణగారిన కులాలవారు బందీలైవున్నారు.

సాహసవంతుడైన పాపన్న బందీలైన వారిని రహస్యంగా కలుసుకున్నాడు. "మనమందరం కలిసి కట్టుగా వుంటే యిక్కడి నుండి బయటపడవచ్చు. మీరు నాతో కలిసి వస్తే మనమే కోటలు, గడీలు కొల్లగొట్టి, సైన్యాన్ని యేర్పరుచుకొని రాజులం కావచ్చు. అప్పుడు స్వేచ్ఛగా బతకవచ్చు." అని ధైర్యం నూరిపోశాడు. పాపన్న సాహస కార్యాలు చూసిన వారు అందుకు అంగీకరించాడు. పాపన్న తమ నాయకునిగా చేసుకున్నారు. పాపన్న న్యాయకత్వంలో జమీందారు ఖైదు నుండి బయటపడాలని నిశ్చయించుకున్నారు. తనతో పాటు వారందరినీ బయటపడేయడానికి పాపన్న పథకం రూపొందించాడు. రహస్యంగా ఆయుధాలు అందించాడు. మంచి అవకాశం కోసం వేచి వున్నారు నిరపరాధులైన ఖైదీలందరూ.

ఒకనాటి అర్థరాత్రి పాపన్న ఆధ్వర్యంలో గడీని బద్దలు కొట్టి అందరూ బయటపడ్డారు. వీరితోపాటు పాత మిత్రులను కలిసి రహస్య జీవితంలో సేకరించిన ధనంతో తన సైన్యాన్ని బలోపేతం గావించాడు. పాపన్న సైన్యం రెండు వేలకు పైగా చేరింది. ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ ముందుకు సాగాడు. కొద్దికాలంలోనే అణగారినకులాల ప్రజా నాయకునిగా యెదిగి రాజ్యవిస్తరణ ప్రారంభించాడు. మొదట సర్వాయిపేటలో బలిష్టమైన కోటను నిర్మించాడు. పాపన్న స్వతంత్రంగా ప్రకటించుకొని కేంద్రంగా పాలించాడు. క్రమ క్రమంగా తన రాజ్యాన్ని విస్తరించుకుంటూ హుస్నాబాద్, కరీంనగర్ ప్రాంతాలను జయించి ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. భవిష్యత్తులో గోల్కొండను జయించడానికి ముందే వ్యూహరచన చేసి తాటికొండలో మరొక కోటను నిర్మించాడు. తాటికొండ కేంద్రంగా వరంగల్, నల్లగొండ ప్రాంతాల్లో వున్న ధనవంతులను కొల్లగొడుతూ తగినంత ధనాన్ని, ఆయుధాలను సమకూర్చుకున్నాడు. తనయేలుబడిలోకి వచ్చిన ప్రాంతాలలో రాతి బురుజులను కట్టించాడు. ప్రజలమన్ననలను అందుకొంటూ తగినంత సైన్యాన్ని వృద్ధి చేసుకొని ప్రజల సహకారంతో నల్లగొండ పరగణా భోనగిరి సర్కారులోని 'షాపురం' వద్ద గుట్టమీద పెద్ద మట్టి కోటను నిర్మించాడు. ఈ కోటను

తన కేంద్రంగా చేసుకొని నల్లగొండ పరగణాలో వున్న జమీందారులను దోచుకుంటూ పెద్ద మొత్తంలో ధనాన్ని కూడగట్టాడు. పాపన్న నిలువరించే వారు లేకపోవడంతో జమీందారులు, భూస్వాములంతా కలిసి ఢిల్లీ పాదుషాకు విన్నవించుకున్నారు

ఔరంగజేబు యీ పరిస్థితి గమనించి పాపన్నను శిక్షించుటకు కొలనుపాక సర్దారగు రుస్తుందిల్ ఖాన్‌ను ఆదేశించాడు. రుస్తుందిల్ ఖాన్ తన అనుచరుడైన ఖాసీంఖాన్‌కు పెద్దసైన్యాన్నిచ్చి పాపన్న మీదికి పంపించారు. ఖాసీంఖాన్ షాపురం కోటను ముట్టడించారు. పాపన్న ఖాసీంఖాన్ సైన్యాన్ని ఎదిరించి, పోరాడి ఖాసీంఖాన్‌ను సంహరించాడు. యీ వార్త విన్న రుస్తుందిల్‌ఖాన్ పాపన్న రాజ్యవిస్తరణలో వుండగా షాపురం కోటను భారీ సైన్యంతో ముట్టడించి కోటను నేలమట్టం చేసిపోయాడు.

అనేక ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్న పాపన్న ధనంతో పాటు సైన్యాన్ని పెద్దమొత్తంలో సేకరించాడు. క్రమంగా సైన్యం మూడు వేలకు చేరింది. ప్రజలకు పాపన్నపై నమ్మకం  ఏర్పడింది. పాపన్నను తమ రాజుగా గుర్తించి వందల మంది సైన్యం చేరారు. చుట్టుపక్కల ప్రాంతాలలో పాపన్న పేరు మారుమోగింది. ప్రజాసైన్యంతో షాపురానికి తిరిగివచ్చిన పాపన్న తాను కట్టించిన కోట శిథిలం కావడం చూసి అదే స్థానంలో బలిష్ట మైన రాతి కోటను నిర్మించాడు. యుద్ధనైపుణ్యాన్ని సంపాదించుకున్న పాపన్న కోటలో ఆధునిక ఆయుధాలను మందుగుండు సామగ్రిని భద్రపరచుకున్నాడు. చుట్టూవున్న పరగణాలలో పాపన్న విజయాలకు యెదురు లేకుండా పోయింది. అణిచివేతకు గురి అవుతున్న కులాల ప్రజానాయకునిగా యెదిగిన పాపన్న ప్రజలకు దానధర్మాలు చేశాడు. ప్రజలకు దొరల నుండి రక్షణ కల్పించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడు. పన్నుల భారం నుండి ప్రజలకు విముక్తి కల్పించి వారి ప్రేమాభిమానాలను చూరగొన్నాడు. పాపన్న ఈ విధంగా మొగలు పాలకుల పక్కలో బల్లెమైనాడు. పన్నుల రాబడి తగ్గడంతో ఔరంగజేబు ఆందోళనకు గురయ్యాడు. పాపన్న స్వతంత్రం ప్రకటించుకొని రాజ్యపాలన చేయ సాగాడు. ఈ పరిణామాలకు మొగలు పాదుషా ఔరంగజేబుకు కలవరం పుట్టింది. యెలాగైనా పాపన్నను అణిచివేయాలని రుస్తుందిల్ ఖన్‌ను ఆజ్ఞాపించాడు.

రుస్తుందిల్ ఖాన్ స్వయంగా పెద్దసైన్యంతో వచ్చి షాపురం వద్ద పాపన్నతో తలపడ్డాడు. పాపన్న సైన్యం వీరోచితమైన పోరాటం  సాగించింది. మూడు నెలల సుదీర్ఘ పోరాటం అనంతరం రుస్తుందిల్‌ఖాన్ పాపన్నచేతిలో ఓడిపోయాడు. చివరికి ప్రాణభిక్షతో రుస్తుందిల్ ఖాన్ వెనుదిరిగాడు. దీర్ఘకాలం సాగిన యీ యుద్ధంలో పాపన్న ప్రియ మిత్రుడు, కుడి భుజం సర్వన్న వీరమరణం పొందాడు. సర్వన్న మరణం పాపన్నను బాధించింది. సమరోత్సాహంతో ముందుకు సాగుతూ నల్లగొండ, భోనగిరి, కొలనుపాక ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు.

పాపన్న విజయాలు స్థానిక దొరలు, భూస్వాములకు మింగుడుపడలేదు. అణగారిన కులంలో పుట్టిన పాపన్నను అంతం చేయాలని వొక చిన్నప్రాంతాన్ని ఆధీనంలో వుంచుకున్న బల్మూరి కొండలరాయుడ్ని వెలమలంతా కలిసి పాపన్న మీదికి పంపారు. యుద్ధాలతో ఆరితేరి, బలవంతుడైన పాపన్న చేతిలో సునాయాసంగా రాయుడు వోడిపోయాడు. స్వకులస్థుల స్వార్థం కోసం పోరాడిన రాయుడు నిజం తెలుకుని పాపన్నతో స్నేహం చేశాడు. పాపన్న అంతిమ లక్ష్యమైన గోల్కొండ కోట ముట్టడిలో సహకరిస్తానని మాట యిచ్చి పాపన్న ఆశీర్వచనం పొందాడు.

క్రీ.శ. 1707లో ఔరంగజేబు మరణించాడు. అప్పటి దక్కన్ సుభేదారు కాంబక్ష్ రాకుమారుడు. ఇతను ఔరంగజేబు కుమారుడు. ఢిల్లీ రాజకీయాలకు అంకితమైన కాంబక్ష్ దక్కన్‌పై పట్టుసడలింది. ఈ పరిస్థితులను ఆసరాగా తీసుకొని క్రీ.శ.1708 ఏప్రిల్ 1 తేదీన పాపన్న వరంగల్ కోటను ముట్టడించాడు. యెంతో సాహసంతో కూడుకున్న యీ ముట్టడిని పాపన్న సమర్థంగా నిర్వహించి మొగల్ ఆధీనంలో వున్న వేల మంది బందీలను విడుదల చేశాడు. వీరిలో వృద్ధులు, పిల్లలు వున్నారు. అనంతరం ధన రాసులని కైవశం చేసుకున్నాడు. లక్షల విలువైన ధనాన్ని వస్తు సామగ్రిని షాపురం తరలించాడు. వరంగల్ కోట ఆధీనంతో పాపన్న పేరు నలుదిశలా వ్యాపించింది. అణగారిన కులాలకు చెందిన యువకులు వేలాదిగా పాపన్న సైన్యంలో చేరారు.

పాపన్నపై చేసిన పలు బల, కుట్రపూరిత ప్రయోగాలు వికటించి నిస్సహాయులైన ఫౌజుదార్లు, సుభేదార్లు, జమీందార్లు ఢిల్లీ పాదుషా  బహదూర్‌షాకు మొరపెట్టుకున్నారు. రాజు స్వయంగా వచ్చి పాపన్నను అణిచివేయాలని వేడుకున్నారు. బహదూర్‌షా స్వయంగా రావడానికి ఇష్టపడక మోసకారైన యూసఫ్‌ఖాన్ రుజ్బహానికి పెద్ద సంఖ్యలో సైన్యాన్ని ఇచ్చి పాపన్నమీదికి పంపించాడు.

వరంగల్‌కోట విజయానంతరం మరికొన్ని దుర్గాలు నిర్మించి సైన్యాన్ని పటిష్టపరచుకున్నాడు పాపన్న. గోలకొండ కోట కొట్టడానికి అనువైన పరిస్థితులు యేర్పడటంతో పాపన్న తన సైన్యానికి ఆధునిక ఆయుధాలు, మరఫిరంగులు ఉపయోగించడంలో శిక్షణ యిప్పించాడు. లక్ష్యాలను చేధించడానికి వ్యూహ రచన చేసుకున్నాడు. అప్పటికి పాపన్న సైన్యం క్రమంగా పెద్దదై 12వేలకు చేరుకుంది.

క్రీ.శ. 1709 ఆరంభంలో పాపన్న గోల్కొండపైకి దండెత్తి వచ్చింది. గోల్కొండ ద్వార మార్గంలో భీకర యుద్ధం జరిగింది. మొగల్ సైన్యాలతో పాపన్న సైన్యాలు వీరోచితంగా పోరాడాయి. అంతిమంగా గోల్కొండ పాపన్న వశమైంది. పాపన్న తన లక్ష్యాన్ని ఛేదించి అనుకున్నది సాధించాడు. ఈ ఓటమి మొగలు నాయకత్వానికి వూహించని పరిణామం. మొగలు నాయకత్వం అపజయంతో రగిలి పోయింది. గోల్కొండ కోట ఆక్రమించిన పిదప పరిపాలనా విషయాలలో నిమగ్నమయ్యాడు పాపన్న. గోల్కొండ రాజ్య పునర్నిర్మాణం చేపట్టి పలు కార్యక్రమాలను రూపొందించాడు. పాపన్న పాలనలో గోల్కొండ ప్రాంతం కోలుకుంటున్న దశలో మొగలు పాలకులు కుట్ర పద్ధతుల ద్వారా పాపన్న సైన్యాన్ని విచ్ఛిన్నం చేయడం ప్రారంభించారు. తన ధైర్య సాహసాలు, వరుసవిజయాలతో యెంతో ధీమాగా వున్న పాపన్న మొగలుల కుట్రలను, మోసపూరిత చర్యలను గమనించలేకపోయాడు. ప్రజలకు రక్షణ, పరిపాలనా సంస్కరణలో మునిగిన పాపన్న యీ ద్రోహాన్ని పసిగట్టలేదు. దీనితో మొగలు సైన్యం మూకుమ్మడిగా స్థానిక దొరలు, భూస్వాముల అండతో గోల్కొండ మీదికి దాడిచేసింది. యీ దాడిలో పాపన్న సైన్యం చాలా వరకు నష్టపోయింది. చివరిదాకా పోరాడిన పాపన్న శత్రువు చేతిలో మరణించడం తన స్వభావానికి విరుద్ధమని తలచి బాకుతో పొడుచుకొని యీ లోకాన్ని విడిచివెళ్లాడు.

# దళిత బహుజన రాజ్యాధికారానికి ప్రతీక

భారతదేశ చరిత్రలో దళిత బిసికుల నాయకత్వంలో దళిత బహుజనులు ఏకమై ఉద్యమిస్తే రాజ్యాధికారం సాధించవచ్చని 17వ శాతాబ్దంలోనే నిరూపించిన సర్దార్ సర్వాయి పాపన్న అన్ని సామాజిక, రాజకీయ ఉద్యమాలకు ముందు వరుసలో వుండాలి. పాపన్న పోరాట నేపథ్యాన్ని నిశితంగా పరిశీలిస్తే ఏకకాలంలో అయిదు అంచెల పోరాట అంశాలు బోధపడతాయి: 1). బ్రాహ్మణ భావజాల వ్యతిరేకత 2). సామ్రాజ్యవాద వ్యతిరేకత 3).

భూస్వామ్య వ్యతిరేకత 4). బుద్ధుని ఆలోచనా విధానం 5). దళిత బహుజన రాజ్యాధికారం.

బ్రాహ్మణ భావజాల వ్యతిరేక పోరాటం : భారతదేశ చరిత్రలో అన్ని రాచరిక వ్యవస్థలో ప్రతి రాజు, పాలకులు పూజారి వర్గాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయలేదు. పైగా హిందూమత సంప్రదాయాలను అనుసరించిన రాజులందరూ బ్రాహ్మణులకు గుడులు కట్టించి, దేవుని పేరిట మాన్యాలు కట్టబెట్టారు. పాపన్న ఇందుకు భిన్నంగా బ్రాహ్మణులకు ఎన్నడూ ప్రత్యేక స్థానాన్ని ఇవ్వలేదు. గుడులు కట్టించలేదు. అప్పటికే ఉన్న గుడుల యాజమాన్యం, పూజారి తత్వం దళిత బహుజనులకే అప్పజెప్పాడు. ఇందుకు ఖచ్చితమైన చారిత్రక ఆధారాలున్నాయి. అందుకే చరిత్ర రచన తమ గుప్పెటలో పెట్టుకున్న బ్రాహ్మణ సమాజం పాపన్న చరిత్రను నిర్లక్ష్యం చేసింది. బహుజన కళాకారులను అదరించాడు కనుకనే జానపదులు పాపన్న జీవితాన్ని ప్రజల హృదయాలలో తమ కళా రూపాల ద్వారా నిక్షిప్తం చేశారు. తెలుగు ప్రాంతాన్ని పాలించిన రాజులలో బ్రాహ్మణ ఆధిక్యాన్ని ఎదురించి నిలిచిన ఏకైక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న.

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం : మొగల్ పాలకుల పెత్తనాన్ని ప్రశ్నించి వారి పాలనకు వ్యతిరేకంగా దళిత బహుజనులను తమ నాయకత్వంలో ఏకం చేసి రాజ్యాధికార పోరాటాన్ని కొనసాగించి సాధించుకున్న దళిత బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న. నేడు మేధావులుగా చలామణి అవుతున్న కొందరు సామ్రాజ్యవాదం గురించి అనేక రకాలుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. కానీ 17వ శతాబ్దంలోనే సామ్రాజ్యవాదులైన మొగల్ పాలనలో దళిత బహుజనన ఐక్యపోరాటంతో ఎదుర్కొని రాజ్యాధికారం చేపట్టాడని తెలీకపోవడం చారిత్రక తప్పిదం.

భూస్వామ్య వ్యతిరేక పోరాటం : స్థానిక అగ్రకుల భూస్వాముల ఆగడాలను ఎదుర్కోవడానికే పాపన్న పోరాటం మొదలు పెట్టాడు. ఆ కాలంలో దొరలు, భూస్వాములు మొగల్ పాలకులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తూ అణగారిన ప్రజల మీద అణునిత్యం వేధింపులకు గురిచేసేవారు. ఈ క్రమంలోనే పాపన్నలో పోరాట పటిమకు అంకురార్పణ జరిగింది. స్థానిక దొరలు, భూస్వాములను ఎదుర్కోవడానికి మొదటగా తన సొంతధనాన్ని ఖర్చుపెట్టి ఆయుధాల్ని పోగుచేసి, సాటి అణగారిన కులాలను తన సైన్యంగా మలచుకున్నాడు. పాపన్న నాయకత్వంలో దళిత బహుజనులు ఐక్యంగా నిలిచి భూస్వాముల మీద విజయం సాధించారు.

బుద్ధుని ఆలోచనా విధానం : పాపన్న తన దళిత బహుజన రాజ్యాధికార పోరాటంలో బుద్ధుడు ప్రవచించిన 'బహుజన హితాయ బహుజన సుఖాయ' అనే సూక్తిని తూచా తప్పకుండా తన రాచరిక పాలనలో అమలు పరిచాడనడానికి ఆధారాలు కనిపిస్తున్నాయి. పాపన్నసైన్యంలో అణగారిన కులాలకే నాయకత్వ బాధ్యతలు అప్పగించడం, బ్రాహ్మణులను దరి చేరనివ్వకుండా దళిత బహుజనులకే పూజా కార్యక్రమాలు నిర్వహించే బాధ్యతను అప్పగించడం, దళిత బహుజనుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ గుడులు కట్టించి తనే స్వయంగా పాల్గొని ఉత్సవాలు జరిపించడం, దళిత బహుజనులకే దాన దర్మాలు, పలు బహుమానాలు అందజేయడం వంటి బహుజన సంక్షేమ కార్యాలను నిర్వహించడాన్ని బట్టి చూస్తే పాపన్న పాలన మీద బుద్ధుని ప్రభావం వున్నట్లు గోచరిస్తుంది. పైగా దక్కన్ ప్రాంతంలో పురావస్తుశాఖ జరిపిన పరిశోధనలో ధూల్మిట్ట, ధూళికట్ట వంటి ప్రాంతాలు బౌద్ధానికి ప్రధాన కేంద్రాలలో భాగమని చరిత్ర తెలియజేస్తున్నది.పాపన్న వీరత్వాన్ని ప్రతిభింబించే శిల్ప సంపద ధూళిమిట్టలో బయల్పడడం దీనినే సూచిస్తున్నది.

దళిత బహుజన రాజ్యాధికారం : భారత దేశ చరిత్రలో ముఖ్యంగా తెలుగు ప్రాంతంలో దళిత బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని మొట్టమొదటి సారిగా నిరూపించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న. పాపన్న స్థానికంగా అగ్రకుల దొరలు, భూస్వాములు తర్వాతి కాలంలో మొగల్ పాలకుల మీద తిరుగుబాటు చేశాడు. ఇక్కడి బ్రాహ్మణ చరిత్రకారులతో పాటు మొగల్ చరిత్రని రికార్డు చేసిన మహ్మదీయ చరిత్రకారులు కూడా పాపన్న పోరాటాన్ని చాలా తక్కువ చేసి రాశారు. క్రీ.శ. 1708లో వరంగల్ కోటను ఆక్రమించే నాటికి మూడువేలమంది కాల్బలము (ఇన్ఫ్యాంట్రి), అయిదు వందల మంది అశ్విక దళము ఉన్నట్లు ఆంగ్ల చరిత్రకారులే ఒప్పుకున్నారు. అగ్రకుల దొరలకు వ్యతిరేకంగా పోరాడిన వీరులంతా సహజంగానే దొరల అరాచకాలవల్ల అనేక అవమానాలకు గురవుతున్న అణగారిన కులాలవారే వుంటారన్నది చారిత్రక సత్యం. దళిత బహుజన రాజ్యాధికారం సాధించాలనే పట్టదలతోనే పాపన్న తన సైన్యంలో దళిత బహుజనులకే సర్వాధికారాలు కట్టబెట్టాడు. అందువల్లనే పాపన్న పోరాటం విజయవంతం అయింది. పాపన్న కాలంలో ఏకమైన దళిత బహుజనులు నేడు ఐక్యం కాలేకపోవడానికి ప్రధాన కారణం కులస్పృహ లేకపోవడం, కులాలను ఏకం చేయగలిగే పంథా దళిత బి.సి. ఐడెంటిటి దళిత బహుజనులలో పాదుకోకపోవడం. మరి పాపన్న కాలంలో ఇది ఎలా సాధ్యం అయింది అంటే ఆ కాలంలో నేటికి గ్రామీణ ప్రాంతాలలో ఉన్నది కులస్పృహ మాత్రమే. ఏ కులానికి ఆ కులం తన సొంత అస్థిత్వాన్ని నిలుపుకుని ఐక్యమైతేనే ఉత్పత్తి కులాలకు రాజకీయాధికారం వస్తుంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ పాపన్న చేసిన పోరాటం, రాజ్యాధికారం కోసం దళిత బహుజనులు ఆచరించాల్సిన ఏకైక సిద్ధాంతం పాపన్నదే అవుతుంది. మరే సిద్ధాంతం దళిత బహుజనులను ప్రభావితం చేయలేదని ఇన్నేండ్ల ఉద్యమ పోరాటాలు రుజువు చేస్తున్నాయి.

# ధూల్మిట్ట వీరశిలపై నున్న శాసనము

సర్దార్ సర్వాయి పాపన్న చరిత్ర పరిశోధనలో భాగంగా పాపన్న శిల్పాలు ఉన్న ధూల్మిట్ట గ్రామం సందర్శించడం జరిగింది. ఈ గ్రామంలో నాశగోని వంశజుల వ్యవసాయ భూమిలో పడివున్న శిల్పాలను గమనించాను. ఈ శిల్పాల మీద చెక్కిన ప్రతిమలను గమనించినపుడు ఇవి పాపన్న ప్రతిమలే అని నిర్ధారణకు వచ్చాను. చరిత్రకారులు పాపన్నకు ద్రోహం తలపెట్టినా, జానపదులు, శిల్పులు పాపన్నను సజీవంగా నిలిపారు. చారిత్రక నిర్ధారణ కోసం శిల్పాల మీద ఉన్న శాసనాన్ని పరిశీలింపచేయగా ఈ ప్రతిమలన్నీ పాపన్న పరాక్రమాలను, యుద్ధరీతులను ప్రతిబింబించే శిల్పాలని నిర్ధారణ అయింది. చరిత్రలో శిల్పాలు చెక్కించే సంస్కృతి రాజులకు, ఆయా కాలాలలో అత్యున్నత స్థానాన్ని చేరుకున్న మహనీయులకు మాత్రమే ఉన్నది. ఈ కోణం నుంచి పరిశీలించినప్పుడు పాపన్న రాజుగా, దళిత బహుజన వీరునిగా ఇంకా అంగీకరించడానికి నిరాకరిస్తున్న కుహనా మేధావులు శిల్పాల మీద చెక్కి వున్న పాపన్న చారిత్రక ఆనవాళ్ళు దృష్టి లోపాన్ని పోగొట్టుతాయని ఆశిద్దాం.

## వీరశిల మీద చెక్కిన పాపన్న చారిత్రక ఆధారాలు

కుడివైపు

1). బండి పోతగౌడ! (బిరుదు)

2). షా ప్రు ఖిలా పులి గౌడ (బిరుదు)

యేబ

3). దిరొడ్డి (50 మంది ఎదిరించె)

షర్వాపా

రయ్డు

(బండిపోత గౌడ. షాప్రుఖిలలా పులి గౌడ!

యేబడి మందిని యెదిర్చిన షర్వారాయడ్డు)

ఎడమపైపు

సౌదరు పా

ప డు

**బొమ్మ శిల్పములోని విశేషములు:-**

1. సాలె పురుగు

ఇది కిటకాలను పట్టుటకు వలవంటి దాన్ని అల్లును

అట్లే పాపన్న వ్యూహము పన్ని శత్రువులను బంధించును.

2. సింహము - సింహము వలె పరాక్రమశాలి దీనినే 'పులి' అని శాసనములో వాడెను.

3. ఛత్రము(గొడుగు) రాజ లాంఛనము అందువల్లనే 'రాయుడు' అని బిరుదు వచ్చెను.

4. పంది, కుక్కలు

అట్టి తురకలను చంపి వేట కుక్కలచే తినిపించెనని అర్థము. తన కుక్కలు వారిని తరిమి తరిమి చంపెనని అర్థము తెలియుచున్నది 'పాపడు', 'పాపారాయుడ్డు' అని రెండు మార్లు అతని పేరు గానవచ్చుచున్నది.

పాపన్న శిలా శాసనం మీద చెక్కిన అక్షరాలను డీకోడ్ చేసినవారు:

పి.వి. పరబ్రహ్మ శాస్త్రి

డిప్యూటి డైరెక్టర్ (రిటైర్డ్)

ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ మ్యూజియములు

హైదరాబాదు.

# పాపన్న కట్టించిన కోటలు, బురుజులు

పాపన్న దాదాపు 30 యేళ్లు వివిధ ప్రాంతాలపై తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. నల్లగొండ పరగణాలోని భోనగిరి, వరంగల్ ప్రాంతంలోని తాటికొండ, కొలనుపాక ప్రాంతంలోని కొలనుపాక, చేర్యాల, కరీంనగర్, వేములకొండ, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాలను తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నాడు. నిత్యం స్థానిక సుభేదారులు, జమీందారులు, భూస్వాములైన దొరలతో పోరాటం వలన నిలకడగా పాలించే అవకాశం పాపన్నకు లేకుండా పోయింది. పాపన్నకు స్థానికంగా పెత్తనం చెలాయించే వారిపైనే కాక, మొగలు సైన్యాలతో పోరాడవలసి వచ్చింది. ఇంతటి వత్తిడిలో కూడా నేటి వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల ప్రాంతాలన్నీ కలిసి దాదాపు 20 యేళ్ళు పాలించాడని చరిత్రకారులే వొప్పుకుంటున్నారు. తన సైన్య రక్షణకు, రాజ్య విస్తరణ కోసం సర్వాయిపేట, తాటికొండ, షాపురంలలో బలమైన కోటలు కట్టించాడు. షాపురం కోటనే తన ప్రధాన స్థావరంగా చేసుకున్నాడు. యివి కాక జనం జ్ఞాపకాల్లో నిక్షిప్తమైన సర్వాయిపేట, వేములకొండ, కరీంనగర్ ప్రాంతాల్లో పాపన్న కట్టించిన కోటల ఆనవాళు ్లన్నాయి. యింకా షాపురం దగ్గర 'మీది కొండ' గుట్టపైన 'ఘనపురం' చెరువుకట్టపైన, హుజూరాబాద్ ప్రాంతంలో 'మాందాపురం' జఫర్‌ఘడ్,వెల్టి, బైరావ్‌పల్లి మెదక్ జిల్లాలో పాపన్నపేట వంటి ప్రాంతాలలో కోటలు, బుబుజుల శిధిలాలున్నాయి. అలిపిరి లేకుండా యుద్ధాలలో మునిగివున్న పాపన్న స్థిమితపడ్డ ప్రతీసారీ యెక్కడో వొక దగ్గర నిర్మాణాలు చేపట్టినట్టు దాఖలాలున్నాయి. దేవాలయాలు కట్టించిన ఆనవాళ్లు లేవు. కట్టించి వుంటే అవి నిలిచివుండేవి.

### తొట్టతొలి కోట సర్వాయి పేట

క్రీ.శ.1675 ప్రాంతంలో పాపన్న స్వతంత్రం ప్రకటించుకొని యేలిన మొదటి ప్రాంతం సర్వాయిపేట. పాపన్న విజయయాత్ర యిక్కడినుంచే మొదలైంది. శత్రుదుర్భేద్యమైన యీ కోట నిర్మాణాన్ని గమనిస్తే పాపన్న శక్తియుక్తులు అవగతమవుతాయి. పాపన్న మొట్టమొదట నిర్మించిన కోట యిది. దాదాపు పది ఎకరాల విస్తీర్ణంలో యీ కోట నిర్మాణం జరిగింది. శత్రువులు ప్రవేశించకుండా వుండేందుకు బలిష్టమైన రాతి ముఖద్వారం వున్నది. దాదాపు 20 అడుగుల ఎత్తులో నిర్మించిన యీ కోట ముఖద్వారం యే రాచరిక వ్యవస్థ నిర్మాణానికి తీసిపోని విధంగా వున్నది. ముఖద్వారాన్ని మూసివేయడానికి అనువైన పద్ధతులు నిర్మాణంలో పాటించారు.

చతురస్రాకారంలో నిర్మించిన యీ కోటకు నాలుగువైపులా దాదాపు 50 అడుగుల ఎత్తులో బురుజులు వున్నాయి. బురుజులపైకి మందుగుండు, ఫిరంగులు చేర్చడానికి మెట్లున్నాయి. సైనికులు నిల్వచేసిన ఫిరంగులు వుపయోగించడానికి అనువుగా బురుజు పైభాగం విశాలంగా వున్నది. బురుజు పై భాగంలో ఫిరంగులను ఉపయోగించడానికి, శత్రువుల నుండి రక్షించుకోవడానికి ప్రత్యేక నిర్మాణ పద్ధతులు అనుసరించారు. కోట ద్వారానికి కుడివైపు రాతితో నిర్మించిన కోనేరు వున్నది. మరికొంత దూరంలో చాద బావి వున్నది. యీ చాద బావిలో యినుప గొలుసులతో కట్టివుంచిన బొక్కెన వున్నది. గొలుసును లాగినప్పుడు నీటిభాగం వరకు వచ్చి ఆగిపోయేది. పూర్తిగా పైకి తేలదు. కారణం తెలియడంలేదు.

కోట ముఖద్వారానికి ఎడమవైపు కోటగిరి గుట్టలున్నాయి. గుట్ట పైభాగంలో కోనేరు, విశ్రాంతి తీసుకోవడానికి అనువైన నిర్మాణాలున్నాయి. యిక్కడే పాపన్న ఆరాధించే బయ్యన్న విగ్రహం వున్నది. పాపన్న ప్రియురాలు చాకలి బుచ్చమ్మ అర్ర (గది) కూడా వున్నది. గుట్టలకు ఆనుకొని కోటచుట్టూ పెద్ద కందకం వున్నది. యీ కందకంలో నీళ్ళు నింపి వుంచేవారు. వంద ఎకరాల విస్తీర్ణంలో నీళ్లునింపిన కందకంలో మొసళ్లను వదిలేవారు. శత్రు బలగాలు నేరుగా కోటలోకి, దాని దరిదాపులలోకి ప్రవేశించకుండా కందకం నిర్మాణం వున్నది. కోటనుండి గుట్టలలోకి రహస్యమార్గాలున్న ఆనవాళ్లున్నాయి. యివన్నీ నేడు శిథిలావస్థకు చేరాయి.

### హుస్నాబాద్ బురుజు

హుస్నాబాద్ గ్రామం మధ్యలో పాపన్న నిర్మించిన బురుజు వున్నది. మిగతా బురుజులు లాగే యిది కూడానిర్మించారు. మరఫిరంగులు, మందుగుండు సామగ్రి నిల్వకు అనుకూలంగా వున్నది. బురుజుపైకి ఎక్కడానికి మెట్లున్నాయి. వొంటిగా వున్న యిలాంటి బురుజులు, ఆయా ప్రాంతాలు పాపన్న ఆధీనంలోకి వచ్చాయని రుజువు చేయడానికి నిర్మించినట్టు తెలుస్తున్నది. రాతితో నిర్మించిన యీ బురుజు నిర్మాణంలో శిథిల దేవాలయాల నుండి సేకరించిన రాళ్లు వాడారు. అయితే యీ రాళ్ల క్రమ పద్ధతిలో వాడలేదు. ప్రతిమలు చెక్కివున్న యీ రాళ్లను సరైన రీతిలో వుపయోగించలేదు. అంటే బురుజు నిర్మాణంలో పాపన్న రక్షణకే ప్రాధాన్యత యిచ్చాడని , ఒద్దిక, విశ్వాసానికి తావియ్యలేదని అర్థమవుతున్నది. యిలాంటి బురుజులు పాపన్న ఆధీనంలోకి వచ్చిన అన్ని ప్రాంతాలలోనూ వున్నాయి.

హుస్నాబద్‌లో వున్న గుట్టకు సమీసంలో పాపన్న యెల్లమ్మ గుడి కట్టించాడు. యెల్లమ్మ విగ్రహం పూర్తిగా మట్టితో తయారుచేశారు. గుడి ముందు వేపచెట్టువున్నది. కాలక్రమంలో యెల్లమ్మ విగ్రహానికి మిగతా విగ్రహాలు కూడా తోడయ్యాయి. పాతగుడి ప్రదేశంలో కొత్తగుడిని నిర్మించారు. పాపన్న చేయించిన విగ్రహం మాత్రం ఆనాటిదే యింకా చెక్కుచెదరకుండా వున్నది. యీ గుడి సంరక్షకులుగా నేటికీ గౌడ్ కులస్థులే కొనసాగుతున్నారు.

### తాటికొండ

మొదట సర్వాయిపేట కేంద్రంగా పాలించిన పాపన్న ఆ ప్రాంతాన్నంతటిని తన ఆధీనంలోకి తెచ్చుకున్న అనంతరం రాజ్యవిస్తరణ వేగవంతం చేశాడు. తన అంతిమ లక్ష్యమైన గోల్కొండను ఆక్రమించుకోవడానికి వ్యూహాత్మకంగా తన స్థావరాన్ని తాటికొండకు మార్చాడు. క్రీ.శ. 1698 ప్రాంతంలో నిర్మించిన తాటికొండ కోట పాపన్న శక్తి సామర్థ్యాలకు, రాజ్యవిస్తరణ కౌశలానికి అద్దంపడుతుంది. రాయి, మట్టి కలయికగా నిర్మించిన కోట, పూర్తిగా రాతితో నిర్మించిన బురుజులు పాపన్న సాధికారతను తెలియజేస్తాయి. యీ కోట నిర్మాణం,రక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలిస్తే పాపన్న సైన్యం వేలసంఖ్యలో వున్నదని భావించవచ్చు. తాటికొండ గ్రామం మధ్యలో వున్న బురుజుతో ప్రారంభ మైనది కోట నిర్మాణం. బురుజుకు కొద్దిదూరం కోట ప్రాంగణంలో రక్షణ కొరకు మరొక నిర్మాణం వున్నది. యిక్కడ ఆధునిక ఆయుధాలతో సైనికులు కాపలా కాసేవారు. యీ నిర్మాణం కోట ముఖద్వారానికి అభిముఖంగా వున్నది. కోట నిర్మాణంలో పాపన్న ప్రత్యేకమైన పద్ధతులు, తనదైన శైలిలో నిర్మించాడు. రక్షణకే ఆయన యెక్కువ ప్రాధాన్యతను యిచ్చాడు. గుట్టను ఆనుకొని నిర్మించిన యీ కోట దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో వున్నది. 60 అడుగుల ఎత్తులో చతురస్రాకారం నిర్మించిన నాలుగు బురుజులు వున్నాయి. కోట ప్రహరీ కూడా అంతే ఎత్తులో చతురస్రాకారంలో వున్నది. చుట్టూవున్న నాలుగు బురుజుల్లోనూ ఆయుధాలతో సైనికులు నిత్యం పహరా కాసేవారు. యీ కోటలో కూడా కోనేరు వున్నది. కోనేరు పక్కనే చిన్న గుడి వున్నది.

కోటలోపల నిర్మాణ కాలాన్ని తెలియజేసే చింతచెట్లున్నాయి. గుట్ట ఒకవైపు భాగాన్ని మూసివేస్తూ కోట గోడలున్నాయి.

గుట్ట పైభాగంలో చుట్టూ ప్రహరీగోడ వున్నది. పాపన్న యీ గుట్టను సురక్షితమైన ప్రదేశంగా మలుచుకున్నాడు. గుట్టపైన మొత్తం 12 బురుజులున్నాయి. కొన్ని రాతి ఖనీలు వున్నాయి. విశాలమైన యీ ప్రదేశంలో ఏడు గుండాలున్నాయి. వొక గుండంలో సంవత్సరం పొడగునా నీరు వుంటుంది. కనుచూపు మేరలో గుట్టల సముదాయంతో రక్షణ వలయంగా వున్న యీ ప్రాంతాన్ని తన కేంద్రంగా యెంచుకోవడంలో పాపన్న ప్రతిభ కనబడుతుంది. తాను ఎక్కువ కాలం ఈ గుట్టలపైనే సేదతీరేవాడు. అందుకనుగుణంగానే యీ నిర్మాణాలు సాగాయి.

తాటికొండ గుట్టనుండి షాపురం వరకు నేల బొయ్యారం వున్నదని గ్రామస్తులు నమ్ముతున్నారు. కొంతమంది యీ బొయ్యారం గుండా అరకిలోమీటరు ప్రయాణించామని చెప్తున్నారు. దీనికి సంబంధించి సొరంగమార్గం యిప్పటికీ వున్నది. పాపన్న మొత్తం పోరాట కాలంలో అన్ని కోటలు, నిర్మాణాలు శత్రుదుర్భేద్యంగా నిర్మించాడు. శత్రువుల చేతికి చిక్కకుండా రహస్యమార్గం గుండా పోవడం పాపన్న ప్రత్యేక లక్షణం. చాలా సందర్భాలలో సైన్యంతో సహా యీ రహస్యమార్గాలద్వారానే బయటపడగలిగాడు. శత్రువుకు లొంగడం, పట్టుబడటం పాపన్న యుద్ధనియమాలకు వ్యతిరేకం. అందుకే తన రాజ్యంలో విలాసవంతమైన నిర్మాణాలకుచోటు కల్పించలేదు. తన సేనల రక్షణపైనే దృష్టి సారించాడు. యివన్నీ కోట నిర్మాణంలో తీసుకున్న జాగ్రత్తలను బట్టి తెలుస్తున్నది.

## విడిదిగా వేములకొండ

రాజ్య విస్తరణలో భాగంగా పాపన్న కొంతకాలం నల్లగొండజిల్లా వేములకొండ గుట్టలమీద వున్నాడు. మూడుగుట్టల సముదాయంలో కుడివైపున వున్న గుట్టలమీద కొంతకాలం, మధ్యభాగంలో వున్నగుట్టమీద కొంతకాలం గడిపాడు. యీ కుడివైపున వున్నగుట్టచుట్టూరాతి తో కట్టిన ప్రహరీ గోడ వున్నది. మధ్యలో కోనేరులో పైభాగం విశాలంగా వున్నది. పైభాగాన రాతితో నిర్మించిన గుడి, రాయి, యిటుకలతో నిర్మించిన మరొక గుడి వున్నాయి. గుట్ట పైభాగం నుండి చూస్తే చుట్టూ కొండలు మాత్రమే కనిపిస్తాయి. మధ్యభాగాన వున్న గుట్టపైన ఒక కోనేరు వున్నది. యిక్కడ విశ్రాంతి తీసుకొవడానికి, శత్రువుల నుండి రక్షించుకోవడానికి అనువైన ప్రదేశం యిది. వేములకొండ నుండి పుడిచేడు వరకు నేలబొయ్యారం వుందని ప్రచారంలో వున్నది. యీ ప్రదేశంలో శిథిలమైన యిటుకులు, మట్టి పాత్రలు కన్పిస్తాయి. మూడు గుట్టల సముదాయంతో మధ్యలో వున్న గుట్ట మిగతావాటి కంటే ఎత్తుగా వున్నది. నల్లగొండ ప్రాంతాన్ని ఆక్రమించే కాలంలో పాపన్న యీ ప్రాంతాన్ని రక్షణ ప్రదేశంగా ఎంచుకున్నాడు. యిక్కడ ఎక్కువకాలం వుండలేదు. కేవలం రాజ్యవిస్తరణలో భాగంగానే కొంతకాలం వుండడం జరిగింది. అందుకే ఎలాంటి ప్రత్యేకమైన కట్టడాలు యిక్కడ చేపట్టలేదు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాత గుడులకు దూరంగా కొత్తగుడులు వెలిశాయి. కృత్రిమ పాదాలు, కొన్ని ప్రతిమలు తయారు చేయించి అతి పురాతరమైనవిగా నమ్మబలుకుతూ అణగారిన కులాల దేవతా ప్రదేశాలను బ్రాహ్మణులు ఆక్రమించిన వాటిల్లో యిదొకటి.

పాపన్న కట్టిన వాటిలో షాపురం కోట ప్రత్యేకతను సంతరించుకుంది. యిదే పాపన్న విజయాలకు కారణమైనది. గోల్కొండ కొట్టేవరకు పాపన్న ప్రధాన కేంద్రం షాపురమే. క్రీ.శ 1700-1705 ప్రాంతంలో షాపురంలో కోట నిర్మాణం జరిగింది. షాపురం కోట నిర్మాణం, దాని గొప్పదనం గురించి డా॥ పేర్వారం జగన్నాథం గారి మాటల్లో-

"కోటకు నాలుగువైపుల పెద్ద బురుజులున్నాయి. మధ్యలో ఎత్తయిన మరొక బురుజున్నది. దీన్ని స్థానిక ప్రజలు 'నడింబురుజు' అని పిలుస్తుంటారు. దక్షిణం వైపు కోట ప్రాకారన్నంటి గుమ్మి ఆకారంలో మరో బురుజున్నది. దీన్ని 'గుమ్మిబురుజు' అని పిలుస్తుంటారు. పడమటి దిక్కున ఈ కోటకు ఎత్తయిన ఒక సింహద్వారం ఉన్నది. దీని ఒక బురుజు నుండి మరొక బురుజుకు నడిచి వెళ్లడానికి వీలైనంత వెడల్పుగా ఉన్నది. ఉత్తరం దిక్కు మట్టితో మూయబడిన మరోచిన్న ద్వారమున్నది. ఈ కోటకున్నవి ఈ రెండు ద్వారాలు. ఫిరంగులు గురిపెట్టి కాల్చడానికి వీలుగా నాలుగువైపులా పిట్టగోడలకు అనువైన రంధ్రాలున్నాయి. ఈ కోటలో మొన్నమొన్నటి దాకా పెద్ద పెద్ద తోపులుండేవి. అవి క్రమంగా చెల్లాచెదురై పోయినాయి. ఈ దుర్గ నిర్మాణానికుపయోగించిన కొన్నిరాళ్లు దేవాలయాలకు చెందినవిగా ఉన్నాయి. బహుశ అవి శిథిల దేవాలయాలనుండి తెచ్చి వాడి ఉంటారు. ఈ కోట ఒక చిన్న పర్వతాన్ని అంతర్భాగంగా చేపుకొని రాయి, సున్నం, ఇటుకలతో శత్రువులకభేద్యంగా నిర్మింపబడి ఉన్నది. ఈ దుర్గానికి మూడు సొరంగాలు కన్పిస్తున్నాయి. ఒకటి కోట మధ్యభాగం నుండి వెలుపల వున్న మంచినీటి బావికి పోతుంది. ఈ సొరంగం ద్వారానే పాపని కాలంలో మంచినీటి బావి నుండి ఏనుగుల నెక్కించుకొని కోటలోకి నీళ్ళు మోసెడివారని జనులు చెప్పుతుంటారు.

ఈ సొరంగం బలువైన రాతి స్తంభములతో సున్నంతో నిర్మింపబడింది. దీనికి దారి పొడవున దిగూడులున్నాయి. బహుశ ఇవి దారి కనిపించడం కోసం దీపములుంచడానికి ఉద్దేశింపబడినవై ఉండాలి. మరో పొరంగం ఒక బురుజుపై నుండి బయలుదేరి ప్రాకారము దాటి ఉత్తరం దిక్కుగా సాగి మట్టితో మూతపడిన సొరంగం ద్వారా పక్కకు తేలుతుంది. షాపురం కోట నుండి తాటికొండ కోటకు సొరంగం ద్వారా వెళ్లడానికి రహస్యమైన మార్గమొకటి పాపని కాలంలో ఉన్నట్లు జనులు చెప్పుతుంటారు. ఇదెంతవరకు నిజమో ఆ సొరంగమేదో తెలియడంలేదు. కాని ఈ ఉత్తరం వైపు కోటకు అతి సమాపంలోనే 'నాంచారి బావి' అని వ్యవహరింపబడుతున్న ఒక పాత బావిఉన్నది"

రాజరిక వ్యవస్థను ఆకళింపు చేసుకొని, దాడులలో అపారమైన జ్ఞానం సంపాదించాడు పాపన్న. శత్రువును యెదుర్కొనడంలో తగు జాగ్రత్తలు తీసుకున్నాడు. షాపురం కోట నిర్మాణం, ఆయుధ సామాగ్రిని నిల్వ చేసుకోవడం వంటివి పాపన్న రాజ్యకాంక్ష, పట్టుదలకు నిదర్శనంగా వున్నాయి. తన స్వతంత్ర పాలనకు షాపురం కోటనే ప్రధాన కేంద్రంగా చేసుకున్నాడు. ఈ కోట నిర్మాణ వివరాలు గమనిస్తే పాపన్నకు వున్న వ్యూహపటిమ, ముందు జాగ్రత్త, యే రాజుకు తీసిపోని విధంగా వున్నాయి. కోట నిర్మాణంలో తీసుకున్న జాగ్రత్తలు చూస్తే పాపన్న యుద్ధ వ్యూహరచనలు, నైపుణ్యం గోచరిస్తాయి.

## పాపన్న రూపానికి సజీవ సాక్ష్యం ధూల్మిట్ట

బౌద్ధానికి ప్రసిద్ధిగాంచిన ధూల్మిట్ట గ్రామంలో సర్వాయి పాపన్న శిలా ప్రతిమలు వున్నాయి. మెదక్, కరీంనపగర్, వరంగల్ జిల్లాల సరిహద్దు గ్రామం ఇది. ఇక్కడ పాపన్న విజయాలను, వీరత్వాన్ని సూచించే రాతిపై చెక్కిన శిలా ప్రతిమలు అనేకం వున్నాయి. పాపన్న తదనంతరం నాశగోని వంశస్థులు ఈ గ్రామానికి వలస వచ్చి వుంటారు. పాపన్న రాజ్యం పతనం తరువాత వీరి వంశంస్తులపై దొరలు, భూస్వాములు దాడులు చేసి వుంటారు. అందువల్ల నాశగోని వారు ఈ గ్రామంలో పాపన్న జ్ఞాపకంగా అనేక ప్రతిమలు వివిధ ప్రదేశాల నుంచి తెప్పించి ఇక్కడ ప్రతిష్టించారు. ఇవి నాశగోని రాజయ్యగౌడ్ పొలంలో వున్నాయి. దాదాపు రెండు వందల సంవత్సరాలకు చెందిన రాతి బావి, మర్రిచెట్టు ఉన్నాయి. బావిని ఆనుకొని ఉన్న మర్రిచెట్టుకింద ఎల్లమ్మ గుడి ఉన్నది. గుడి సమీపంలోని గుర్రంపై పాపన్న రాజ దర్పంతో వున్న నల్లరాతిపై చెక్కిన ప్రతిమలు ఉన్నాయి. ఈ

ప్రదేశం దగ్గరలోనే పెద్దవాగు ఉన్నది. పాపన్న ఇష్ట దైవం ఎల్లమ్మకు, పాపన్నకు గౌడ్ కులస్థులు ఉత్సవాలు జరిపేవారు.

పాపన్న వీర గాథలకు గుర్తుగా గౌడ్ కులస్థులు ఈ ప్రదేశాన్ని పవిత్రంగా కొలిచారనడానికి ఆనవాళ్లున్నాయి. పాపన్న గుర్రంపై ఆశీనుడై వున్న నల్లరాతి ప్రతిమతో పాటు, వేటకుక్కలు, రాజులు ఉపయోగించే అధికారిక చిహ్నాలు కూడా ఈ ప్రతిమలో ఇమిడి ఉన్నాయి. ఇంకా పాపన్న వీరత్వాన్ని సూచించే తెలుపు, నల్లరాతిపై చెక్కిన ప్రతిమలు శిల్పుల నైపుణ్యాన్ని ఇనుమడింప జేస్తున్నాయి. పాపన్న వరలోంచి కత్తిని తీసే ప్రతిమ అత్యంత ప్రతిభావంతంగా చెక్కి ఉన్నది.

ఎంతో కాలంగా పాపన్న జ్ఞాపకంగా వీరి వంశస్తులు, గౌడ్ కులస్తులు జరుపుకున్న ఉత్సవాలు కొనసాగడం లేదు. పవిత్రమైన ఈ ప్రదేశం కొంత వ్యవసాయ భూమిగా మారి, ప్రతిమలు శిథిలాస్థలో వున్నాయి. ఇక్కడ ఉన్న చారిత్ర ఆనవాళ్లని పరిశోధిస్తే పాపన్న గురించిన మరికొంత చరిత్ర వెలుగులోకి వచ్చే అవకాశం వున్నది.

# చరిత్రకారులు ఏమన్నారు?

పాపన్న చరిత్ర వక్రీకరించిన చరిత్రకారులను యెదుర్కొని వీరునిగా నిలబెట్టిన ఘనత మొట్టమొదటగా జానపద కళాకారులకే దక్కుతుంది. యీ జానపదులే పాపన్న చరిత్రను, వీరోచిత పోరాటాలను కాలగర్భంలో కలిసిపోకుండా తమ గుండెల్లో దాచుకున్నారు. వీరే నిజమైన చరిత్రకారులు. పాపన్న వ్యక్తిగత జీవితాన్ని వదులుకొని సాహసవంతమైన యుద్ధాల ద్వారా అణగారిన కులాలకు రక్షణ యిచ్చాడు. చివరి వరకు సామాన్యమైన ప్రజల కోసమే పోరాటం సాగించాడు. పాపన్న సాహస ఘట్టాలు, వీరోచిత జీవితం తరం నుంచి తరం మూడు వందల యేల్లకుపైగా తమ హృదయాల్లో నిక్షిప్తం చేసుకున్నారంటే వారి జ్ఞానం గొప్పది. నాగరిక ప్రపంచపు ఛాయలు వీరిని తాకలేకపోయాయి. అందుకే జానపదులు, వారు కొలిచే వీరుడు పాపన్న నిష్కళంకంగా జీవిస్తున్నారు. జానపద కళాకారులు అందించిన- పాపన్న చరిత్రకి కొంతమంది చరిత్రకారులు లిఖిత రూపం యిచ్చారు. క్రీ.శ. 1874లో జె. ఎ. బోయల్ అనే ఆంగ్లేయుడు మొట్టమొదటిసారి జానపదుల ద్వారా పాపన్న నిజ చరిత్రను వెలికి తీశాడు. మద్రాస్‌లో దక్షిణ దేశ ప్రజలకు చెందిన జానపద సాహిత్య కృషిలో వొక పుస్తకం ప్రచురించారు. అందులో తెలుగు భాషకు జరిగిన నష్టాన్ని పూరించేందుకు బోయల్ నడుం కట్టారు. వీరు మొదటి ప్రయత్నంలోనే బళ్లారి దగ్గర బోయ కులస్థుడు పాడుతున్న పాపన్న చరిత్రను రికార్డు చేశారు. ఇదే పాపన్న చరిత్ర వెలుగులోకి రావడానికి కారణమైనది.

పాపన్న ఆశయం, వీరత్వాన్ని గురించి జానపదులు యిలా పాడుకున్నారు.

"వస్తాడు, తాను సర్వాయి పాపడు !
తల్లి కొలువుకు వదిగి వెళ్లెను.
తల్లికి దండముగ నిలిచెను,
ఏరుకట్టి వ్యవసాయము అమ్మా,
ఎంగలి ముంత ఎత్తలేదు,
కొట్టుదును గోల్కొండ పట్టనం,
ఢిల్లీకి మోజూర్ నవుతాను
మూడుగడియల బందర్ కొట్టుదును,
మూలకోట కందనూర చూచి,
బంగరు కడియాల పెట్టుదును,
మనకంత బంట్రోతు తనమేల!"

పాపన్న యెంతటి ఘనుడో చెప్పడానికి జానపదులు అనేక విధాలుగా పోలుస్తారు. ఈ పోలికలన్నీ కూడ ప్రజలందరి నిత్యజీవితంలో సంబంధం వుండేవి. ప్రజలకు అర్థం కావడానికి వీలుగా వుండేవి. పాపన్న తలుచుకుంటే యేమైనా చేయగలడని, యెదుటివారిలో ఎంతటి భయోత్పాతాన్నయినా పుట్టించగలడని యీ వర్ణనలు నారూపిస్తాయి.

"అడుగో పాపడు వస్తాంటె
కుందేళ్లు కూర్చుండపడెను
లేడి పిల్లలు లేవలేవు
పసిబిడ్డలు పాలు తాగవు,
నక్కలు సింహాలు తొక్కబడును.

పాపన్న యేదైనా గొప్పకార్యం చేయముందు కల్లు తాగేవాడు. ధనవంతులను కొల్లగొట్టేముందు, యుద్ధానికి బయలుదేరే ముందు తన అనుచరులతో కల్లుతాగేవాడు. పాపన్న శక్తి, సామర్థ్యాలు, పట్టుదల, మనోధైర్యాలను వెల్లడి చేయడానికి జానపదులుకై గట్టిన పదాలు :

"పాపడు తాగెడి కల్లు
ఏతాటి కల్లు, యేతాటి కల్లు
వేలు పెడితే వేలుతెగును
దివిటి పెట్టితే భగ్గున మండును;
తాగేటప్పుడు తీయగ వుండును;
తాగినవాన్ని లేవనీయదు
లేచినవాన్ని పోనివ్వదు -J.A.Boyle

ముస్లిం చరిత్రకారులు రాసిన గ్రంథాలను అనుసరించి, వారు చూపించిన బాటలో నడిచి, రాసిన ఆంగ్ల చరిత్రకారులు పాపన్న వీరత్వాన్ని

సహించలేకపోయారు. క్రీ.శ.1708లో వరంగల్ కోటను ముట్టడించి, మొగల్ సైన్యాలను తరిమి వేలమంది బంధ విముక్తుల్ని చేశాడు. అపారమైన ధనరాసుల్ని పాపన్న కైవశం చేసుకున్నాడు. అత్యంత సాహసము, యుద్ధనైపుణ్యంతో చేసిన ఈ దాడిని మహ్మదీయ చరిత్రకారులు వక్రీకరించి రాశారు. పాపన్న విజయాన్ని సహించలేని వీరు చరిత్రను అసత్యాలతో నింపారు. పాపన్నసైనిక బలాన్ని తక్కువగా చూపి రాశారు. వరంగల్ కోటమీద చేసిన దాడి పాపన్న యుద్ధరీతులకు నిలువెత్తు సాక్ష్యం. గోల్కొండకు వరంగల్‌కు మధ్య షాపురంలో నిర్మించిన కోట మొగల్ సైన్య బలహీనతను, పాపన్న సైన్యం శక్తి, సామర్థ్యాలను నిరూపించింది. పాపన్నను బందిపోటుగా చిత్రించే క్రమంలో అతని గొప్పదనాన్ని వీరత్వాన్ని ఒప్పుకోక తప్పని స్థితి యీ రకమైన రాతలలో కన్పిస్తుంది.

Papra,a today by caste, who had assembled a small army, built for himself a fort shapur in the Bhongir paragana,and raided the country for and near....

.....Prince Kam Bakhsm who, after his father’s death, was governor of Bijapur and haidrabad did nothing to repress papra. Who was so much encouraged by the retirement of Rustam dil Khan that he ventured to attack Warangal, from which his strong hold was about thirty miles distant.

On muhurram 10th AD 1120 (April 1st 1708) When all musalmans and Hindus alike, as the historians says, were engaged in the procession of the tabuts, papra arrived at the fort of warangal with two or three thousand infantry and four or five hundred horse and closed the roads in order to prevent news of his arrival from reaching the interior fortress while the cavalry sacked the town. The fort was captured and money and property to the value of lakhs of rupees and money of the famous carpets of warangal fell in the hands of the plunderers, and about 12,000men, women and children were taken prisoners....

*-T.V.Haig*

ముస్లిం చరిత్రకారుల రాతలను పట్టించుకోకుండా పాపన్న వీరత్వం గురించి స్వయంగా సేకరించదలిచారు జె.ఎ. బోయెల్ అనే ఆంగ్లేయుడు. ఈయన పాపన్న చరిత్ర కోసం నిజమైన ప్రజల చరిత్ర పరిరక్షకులైన జానపద కళాకారులను ఆశ్రయించారు. వీరి కృషి ఫలించి పాపన్నను వీరునిగా గుర్తించారు. యిదే దారిలో పయనించిన తొలి తెలుగు చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖర శర్మ. దారి తప్పి అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న తెలుగు చరిత్రకారులకు పాపన్న గురించి తెలుసుకోవడానికి వీరు దారి చూపించారు. చరిత్రను వాస్తవికంగా సామాజికంగా అంచనావేసి పాపన్నను వీరునిగా కీర్తించిన మహాశయుడు.

“దుర్గములు నిర్మించి,దుర్గములను సాధించి రాజ్యమును విస్తరించుకొన, ప్రయత్నించిన వాడు దొర గాక దొంగ యెట్లగును” -మల్లంపల్లి **సోమశేఖర శర్మ**

“ఈ భోనగిరి దుర్గ సంబంధమున సర్వాయి పాపడనుఆంధ్ర వీరుని కథ చారిత్రకముగా ప్రఖ్యాతి చెందియున్నది.” **-ఆదిరాజు వీరభద్రరావు**

“కేవలం ఉత్సాహం వల్ల నేస్తాల్ని, పరిమితమైన సైన్యాన్ని సమీకరించి, గోల్కొండ నవాబునే కాందిశీకుడ్ని చేయగలిగిన ఈ తెలుగు వీరుడి గాథమనకు విన సొంపైనది”

**- హరి ఆదిశేషువు**

“ఖిలా షాపురము కోట నేడు శిథిల రూపమున కనిపించుచున్నది. హిందువులును ముస్లిం పాలకుల నుండి రక్షించు దీక్షతో దుర్మార్గులను, దుష్టులను, జమీందారులను, సర్దారులను హింసించి కొల్లగొట్టి హిందూరాజ్య నిర్మాణమునకు జీవితమును ధారపోసిన దేశాభిమాని సర్వాయిపాపన్న జీవితమున సుఖపడి సంతోషముగనున్న కాలమ సూన్యమైనను, తన ఆశయసిద్ధికి ప్రాణములను త్యజించిన స్వతంత్ర సమరయోధుడు సర్వాయిపాపన్న. ధనాఢ్యులను, సర్ధారులకు, ముస్లిం పాలకులకు , చివరికి ఢిల్లీ చక్రవర్తికి కూడా సింహస్వప్నమై, తన పేరు విన్న గడగడలాడిపోవునట్లు ప్రవర్తించిన సర్వాయి పాపన్న చిరస్మరణీయుడు.”

సర్వాయి పాపన్న దారిదోపిడిదారుగా వ్యవహరింపబడినాడు. కాని అతడు ముస్లిం పాలకుల పాలిట కాళుడు. బీదప్రజల దైవము.స్వాతంత్ర్య భావములు కలిగి, అతి సామాన్య కుటుంబమున జన్మించి, నాయకునిగా, వీరునిగా, రాజ్యపాలకునిగా, ఎదిగి ఆంధ్ర పౌరుషమును చాటి చూపిన వీరుడు. అరివీరభయంకరుడు. తెలుగువారి స్వతంత్ర్య పరిరక్షణకు పోరాడిన యోధుడు.”

**- బి.ఎన్. శాస్త్రి**

“ఔరంగజేబు పాలన కాలంలో మొగలు సామ్రాజ్యం కుక్కమూతి పిందెలు వేసింది. మత వైషమ్యమే మూల సూత్రముగా హింసా ప్రవృత్తే రాజనీతిగా భరతవర్షాన్ని పరిపాలించిన ఔరంగజేబుకు పక్కలో బల్లెమై హైందవధర్మాన్ని ఉద్ధరించి జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించినవాడు - అటు మహారాష్ట్రంలో ఛత్రపతి శివాజీ కన్పిస్తాడు. అట్లాగే విజాతీయ ప్రభుత్వ పైశాచిక విలయనాట్యాన్ని అంతమొందించడానికి ఇటు దక్షిణ భారతంలోనూ అట్టి ప్రయత్నాలు చేసిన వారెందరో వున్నారు. సర్వాయి పాపన్నకూడా తెలంగాణాలో తురుష్కల దమన నీతిని నేలమట్టం చేయడానికై తన రక్తాన్ని హవిస్సుగా ధారవోసిన అమరవీరుడు విప్లవజ్యోతి”

**- డా॥ పేర్వారం జగన్నాథం**

మల్లంపల్లి సోమశేఖర శర్మ తర్వాత పాపన్నజీవిత క్రమాన్ని అంత వాస్తవికంగా పరిశీలించిన మరొక మహానుభావుడు డా. బిరుదురాజు రామరాజు, వీరు పాపన్న చరిత్రను మురుగున పెట్టిన క్రూరమైన చరిత్ర చీకటి దారుల వెంట పయనించారు. అలా పయనించి కొత్త తరానికి ఒక దివిటీ అందించారు. వీరు చూపిన వెలుగులోనే పాపన్న చరిత్ర కొంతవరకైనా సజీవంగా మనగలుగుతున్నది.

“తక్కువ కులమున జన్మించి కల్లుగీత వృత్తిగా, మొదట బతికిన పాపడు, తెలుగుదేశమును గడగడలాడించుటయే కాక ఢిల్లీ చక్రవర్తికి సైతము తీరని సమస్యగా పరిణమించినాడన్నఅతని ధైర్యసాహసములు వీరవిక్రమములు కొనియాడదగినవి.”

**- డా॥ బిరుదురాజు రామరాజు**

“ఔరంగజేబు పాలనా కాలంలో కల్లుగీత వృత్తిద్వారా జీవించే సర్వాయి పాపన్న తురక సర్దారులను ఎదిరించి ప్రజలకు రక్షణ యిచ్చిన మహావీరుడని

పేరేగాంచాడు".

- యేటుకూరి బలరామమూర్తి

# వెలమ కుల గురువులు చెప్పే కథ

వొకరోజు పాపన్న సైన్యాభివృద్ధి, రాజ్యవిస్తరణలో భాగంగా తన సైన్యంతో సూరారం చెరువు కట్టమీది నుండి వస్తున్నాడు. చెరువు కట్టమీద ఆరేసిన చీర అందానికి ముగ్ధుడయ్యాడు. యింత అందమైన చీరను కట్టుకున్న స్త్రీ కూడా అందంగా వుంటుందని వూహించుకున్నాడు. చాకలి వారిని పాలిచి ఆ చీర యెవరిది? ఆమెకు వివాహమైందా? అని ప్రశ్నించాడు. చీర వెలమ దొర కూతురిదనీ ఆమెకు యింకా వివాహం కాలేదని వారి ద్వారా తెలుకున్నాడు. తాను వూహించుకున్న స్త్రీ అందాన్ని స్వయంగా చూడదలచి రహస్యంగా సూరారం వెలమదొర గడిలోపల వున్న చింత చెట్టుపై రెండు వెన్నెల రాత్రులు పడిగాపులు పడ్డాడు. రెండవ రోజు ఆ యువతి దర్శనమిచ్చింది. పాపన్న వూహించుకున్న విధంగానే ఆ యువతి అతిలోక సౌందర్యంతో అలరారుతున్నది. ఆమెను పెళ్లి చేసుకోదలచి దొరకు కబురు పంపించాడు. యీ వార్త విన్న వెలమ దొర హతాశుడై, పాపన్నకు భయపడి యేడవ దినమున యిచ్చి చేయగలనని చెప్పి పంపించాడు. ఐదవ రోజున వరంగల్‌నుండి మందుగుండు తెప్పించి వొక గదిలో పరిపించాడు. 'కాన్దాన్ - యిజ్జతు' కలిగిన యీ వెలమదొర తన కూతురిని పాపన్నకు యిచ్చి పెళ్లి చేయడం, అంటే కులహీనుడు కావడం కంటే మరణించడం వుత్తమమని భావించాడు. వంశాభివృద్ధి కోసం చంటి పిల్లవాణ్ణి వుపాయం వెంట మేనమామల దగ్గరకు చేర్చి మందుగుండు పరిచిన గదిలోకి ప్రవేశించి తలుపులు బిగించి కుటుంబమంతా ఆత్మహత్య గావించుకున్నారు. యిది కోమటిపల్లి బ్రాహ్మణులు రాసిన పాపన్న కథ. వీరు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ తాలూకాలోని సూరారం వెలమదొరల కుల గురువులు.

చంటి పిల్లవాణ్ణి దాసి మేనమామల యింటికి చేర్చే క్రమంలో వూరి పొలిమేరలో వొక పెళ్లి బృందం యెదురౌతుంది. యీ పెళ్లిబృందం పాపన్న వారే అని భ్రమించి ఆ దాసి పిల్లవాణ్ణి తంగేడు చెట్లల్లో దాచింది. తంగేడు చెట్లల్లో దాచడం వలన ఆ పిల్లవాని యింటి పేరు 'తంగెడ' ఐంది. అంతకుముందు వీరి వంశస్థుల యింటి పేరు 'గుమ్మడము' 'గుమ్మడవెల్లి' అని వుండేది. ఉస్మానియా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ గా పనిచేసిన నవనీతరావు ఇంటిపేరు తంగెడ. యీ తంగెడ యింటి పేరుగల వారి వారసులు నేటికీ సూరారం, జీలుగుల, కోతులనడుమ, గోపాలపురం గ్రామాలలో వున్నారు.

లిఖిత, మౌనిక రూపంలో వున్న యీ కథను పరిశీలిస్తే పాపన్న వ్యక్తిత్వాన్ని అర్థంచేసుకోవచ్చు. యీ సంఘటన క్రీ.శ. 1687లో జరిగింది. యీ కథ పాపన్నకు వ్యతిరేకంగా అనేక పుట్టు కథలతో ప్రచారం జరుగుతున్నది. ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులను అన్వయించి పరిశీలించినపుడే వాస్తవాలను గ్రహించే అవకాశం వున్నది.

పాపన్న నుంచి సమాచారం అందుకున్న వెంటనే సూరారం వెలమదొర చుట్టుపక్కల వున్న దొరలందరినీ పిలిపించి రహస్య సమావేశం నిర్వహించాడు. వచ్చిన దొరలందరూ ముక్తకంఠంతో పాపన్నను యెదిరించే శక్తి మనకు లేదు కనుక గౌరవంగా కూతురునిచ్చి పెళ్లి చేయమని లేదంటే పరువు దక్కాలంటే వూరు విడిచి వెళ్లమని సలహాయిచ్చారు. 'కాన్దాన్- యిజ్జతు' కలిగిన యీ రెండు మార్గాలు తన గౌరవానికి భంగకరమని తలచి చావునే యెంచుకున్నాడు. అణగారిన కులాలను ఆనాటి రాచరిక వ్యవస్థలో తక్కువగా చూసేవారని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. పాపన్న అత్యంత బలవంతుడని, ప్రజాబలం కలిగిన వాడని తెలుస్తున్నది. దొరలంతా కలిసి ప్రజా సమీకరణద్వారా పాపన్నను యెదిరించవచ్చు. కానీ దొరలు నిస్సహాయత ప్రకటించారంటే ప్రజలంతా పాపన్నవైపే వున్నారన్నది అర్థమవుతున్నది. అణగారినకులాల ప్రజల మద్దతు పాపన్నకు వుంది. కనుకనే బలప్రయోగం చేయకుండా కూతురినిచ్చి పెళ్ళిచేయమని కబురు పంపించారు. గౌరవం, మర్యాదలకు కట్టుబడి వుండడంవల్ల దొరకు తనకు భంగకరం కాని విధానాన్ని యెంచుకున్నాడు. పాపన్న ముందు ఆ యువతి యెవరు? వివాహం అయ్యిందా? లేదా? అనే విషయాన్ని అడిగి తెలుసుకునాన్నడు. అంటే యేమిటి అర్థం? తాను బలవంతుడు కనుక పెళ్ళైన స్త్రీని కోరుకునే స్వభావంకాదు పాపన్నది. పైగా తను కోరుకుంటే చాలు యెలాంటి స్త్రీ అయినా ఫరవాలేదు అనే మొండివైఖరి కూడా పాపన్నలో లేదు. తాను కోరుకున్న స్త్రీ అందంగా వుండాలి దొరకూతురైనా సరే. అందుకే రెండు వెన్నెల రాత్రులు దొరగడిలో వున్న చింతచెట్టు మీద ఆ యువతి అందాన్ని చూడడానికి నిరీక్షించాడు. రెండోరోజు రాత్రి కనిపించిన ఆ యువతి తాను ఊహించిన విధంగా వున్నదని నిర్ధారించుకున్న తర్వాతే పెళ్లిచేసుకోవాలనే కబురు అందించాడు. వెలమదొరతో వైరం వున్న పాపన్న ఆ యువతి వెలమ దొర కూతురని తెలిసికూడా బలవంతంగా యెత్తుకొని పోయే పనిచేయలేదు. అంటే పాపన్న రాచరికవ్యవస్థలోని దుర్మార్గాల స్థాయికి తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకొనే మనస్తత్వం కాదని స్పష్టమవుతున్నది. ప్రజాబలం వున్ననాయకుడు కనుకనే గౌరవంగా హుందాగా ప్రవర్తించాడు.

ఆనాటి రాచరిక వ్యవస్థలో బలమున్నవాడిదే రాజ్యం. న్యాయం. అలాంటి రాచరిక వ్యవస్థలో వుండి వొక ప్రాంతాన్ని తన యేలుబడిలోకి తెచుకున్న పాపన్న యింత మర్యాదగా ప్రవర్తించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రతి నిత్యం కష్టపడుతూ, పూటకో సాహసం చేసే గౌడ్‌కులంలో పుట్టడంవల్లనే యెదుటివారి కష్టనష్టాలను అర్థంచేసుకునే విశాలహృదయం పాపన్నలో యేర్పడింది. మొత్తం రాచరికవ్యవస్థలో యింత గౌరవంగా ప్రవర్తించిన పాపన్న వంటి తెలుగువీరుడు మరొకరు కనిపించరు. అన్ని రాచరిక వ్యవస్థల్లో రాజులు ప్రజలను, సాటి వారిని దారుణంగా హింసించి అణిచివేసిన సందర్భాలే యెక్కువ. విదేశీ, స్వదేశీ రాజ్యాలు స్థాపించి వారు తమకు నచ్చిన స్త్రీని బలవంతంగా యెత్తుకొనిపోయారు. అడ్డం వచ్చిన వారందరినీ అంతమొందించారు. స్త్రీల కోసం రాజ్యాలనే నాశనం గావించుకున్నారు. మహమ్మదీయరాజులు, సైనికులు వేలమంది స్త్రీలను చెరబట్టారు. బందీలుగా చేసుకొని హింసించారు. కానీ పాపన్న అలా ప్రవర్తించలేదు. అయినా అణగారిన కులానికి చెందిన వాడు కనుక చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేశారు. అసత్యాలనే నిజమని నమ్మించే ప్రయత్నం చేశారు. యిప్పటికీ చేస్తున్నారు.

# పాపన్నబహుజన తత్వం

ఆనాటి దక్కన్ ప్రాంతంలో గోల్కొండ ప్రధాన కేంద్రంగా వర్ధిల్లింది. ఈ ప్రాంతం పంటలతో, ధనరాసులతో విరాజిల్లింది. మొగల్ పాదుషా ఔరంగజేబు కర్నాటక, మరాఠా సంస్థానాల కంటే గోల్కొండ పైనే దృష్టిని కేంద్రీకరించాడు. మరాఠాలో శివాజీతో సుదీర్ఘకాలం పోరాటం అనంతరం మొగలు సైన్యం క్షీణించింది. ఈ నేపథ్యంలో సైన్యాన్ని బలోపేతం చేపుకోవడానికి ఔరంగజేబు గోల్కొండపై దాడి ప్రారంభించాడు.అప్పటికే దక్కన్ ప్రాంతంలో

ముఖ్యంగా తెలంగాణా పరగణా సాగునీటి వనరులతో విస్తారమైన పంటలతో స్వయం పోషక గ్రామీణ వ్యవస్థగా రూపొంది వున్నది. యిది గమనించిన ఔరంగజేబు తెలంగాణాలో వున్న సంపదను కొల్లగొట్టే ఉద్దేశంతో గోల్కొండపైకి దండెత్తి వచ్చాడు. సుభిక్షమైన పంటలతో ధనరాసులతో విరాజిల్లుతున్న యిలాంటి ప్రాంతాన్ని ఇంతకుముందెన్నడూ చూడలేదని ఔరంగజేబు స్వయంగా తండ్రికి రాసుకున్న లేఖలో పేర్కొన్నాడు. అటువంటి స్వయం పోషకవ్యవస్థలో స్థానిక సుబేదారులు, జాగీర్దారులు, దొరలు, భూస్వాములు చిన్నచిన్న సైన్యాలను యేర్పరచుకొని ప్రజలను దోచుకునేవారు. ప్రజలపై విపరీతమైన పన్నులు వేసి, వసూలు చేస్తుండేవారు. ప్రజలకు రక్షణ కరువైంది. ఇలాంటి సమయంలో గౌడ్ కులంలో పుట్టిన పాపన్న సాటి అణగారిన కులాలకు చెందిన ప్రజల మద్దతుతో రాజ్య నిర్మాణం చేసి, వారికి రక్షణ యిచ్చాడు. పాపన్న వీరత్వానికి ఆకర్షితులైన ప్రజలు స్వచ్ఛందంగా అతని అనుచరులయ్యారు. సహజంగనే మహమ్మదీయ పాలకుల ఏజెంట్లు, స్థానికంగా వున్న అగ్రకులాలకు చెందిన దొరలు, భూస్వాములకు పాపన్న ఆగ్రహం తెప్పించాడు. అణగారిన కులాలకు చెందిన ప్రజాబలంతో వృద్ధిచెందుతున్న పాపన్నను యెదుర్కొనే శక్తిలేని అగ్రకులాలు చెడు ప్రచారం ప్రారంభించారు. పాపన్నకు మద్దతుగా నిలిచిన వారిని అనేక విధాలుగా హింసించారు. వారిని సొంత జైళ్లలో బందీ చేశారు. పాపన్నను యెలాగైనా అంతమొందించాలనే తపనతో నిత్యం ఆరాటపడ్డారు. వొకపక్క పాలకుల అనుయాయులు మరోపక్క స్థానిక అగ్రకుల జమీందారులు. వీరిలో ముఖ్యంగా వెలమదొరలు. వీరి ప్రయత్నాలను వమ్ముచేసుకుంటూ ముందుకు సాగాడు పాపన్న. పాపన్నపై బలప్రదర్శన, చెడు ప్రచారం పారకపోవడంతో మరొకమార్గం లేక లొంగిపోయి పాపన్నను అంతం చేసే సమయం కోసం కాచుకున్నారు.

మహమ్మదీయ చరిత్రకారులు రాసిన రాతలను బట్టి గమనిస్తే క్రీ.శ. 1708లో వరంగల్ కోట ముట్టడించి, ఆక్రమించే నాటికి పాపన్నసైన్యం దాదాపు 4వేలు. అందులో మూడు వేలకుపైగా కాల్బలం, ఐదువందలకు పైగా అశ్విక దళం, పాపన్నసైన్యంలోని వారంతా ఆధిపత్యవర్గాల వలన తరతరాలుగా పీడనకు గురైనవారే. అంటే అణగారిన కులాలకు చెందిన వారు. యింతటి ప్రజాసైన్యానిన్ర నిర్మించిన పాపన్న నిజమైన ప్రజా నాయకునిగా, రాజుగా వెలుగొందాడు. పాపన్న సైన్యంలో మాదిగ,మాల, చాకలా, కుమ్మరి, మంగలి, ముత్రాసి, దూదేకుల వంటి అన్ని అణిచివేలకు గురవుతున్న కులాలకు చెందిన వారున్నారు. వీరిలో ప్రతిభను చూపిన చాకలి సర్వన్నను తన ప్రధాన అనుచరునిఆ చేసుకున్నాడు. ప్రజాచరిత్రకారులైన జానపదులు తమ పాటల్లో వాస్తవాన్ని చాటిచెప్పారు. ఆధిపత్యవర్గాల, అగ్రకులాల వ్యతిరేకత మూలంగానే యిన్ని వేలమంది పాపన్నసైన్యంలో చేరగలిగారు. వారి ఆశలకు అనుగుణంగా పాపన్న అణగారిన ప్రజలకు రక్షణ యిచ్చి, అభిమానాన్ని చూరగొన్నాడు. పాపన్నకాలానికి మహమ్మదీయ పాలకుల, వారి అనుచరులు వెలమ దొరలంతా వొకవైపు, అణగారిన కులాలకు చెందిన వారంతా పాపన్న వైపు చేరారు. సాటి అణగారిన కులాలను చేరదీసి రాజ్యాన్ని నిరి&ంమంచవచ్చనే యదార్థాన్ని ఆనాడే నిరూపించాడు పాపన్న.

బ్రాహ్మణీయ, అగ్రకుల వ్యతిరేకతతోనే యింతటి విజయాన్ని పాపన్న సాధించాడని చెప్పవచ్చు. పాపన్నలో వున్న బ్రాహ్మణీయ వ్యతిరేకతను మూడు దశలలో నిరూపించవచ్చు. వొకటి కుటుంబలో జరుగుతున్న మతాచారాలను వ్యతిరేకించాడు. ప్రజలందరితో కలవడానికి కల్లుతాగడం, మాంసం తినడం అలవాటు చేసుకున్నాడు. రెండు అణగారిన కులాలను చేరదీసి పెద్ద సైన్యాన్ని నిర్మించాడు. వారి కుటుంబాలకు కొన్ని గుడులలో పూజారి తనాన్ని యిచ్చాడు. మూడు తాను పరిపాలించిన 20 యేళ్ళలో యేనాడూ గుడి కట్టించలేదు. బలమైన కోటలు, దుర్గాలు కట్టించాడే కాని బ్రాహ్మణులను పోషించే దేవాలయాలను కట్టించలేదు. అయితే పాపన్నలో వున్న గొప్పతన మేమిటంటే తాను సవప్రదాయవ్యతిరేకి అయినా ప్రజల భక్తి, విశ్వాశాలను దెబ్బతీసే పనిచేయలేదు. మహమ్మదీయులు లాగా గుడులు కూలకొట్టలేదు. అణగారిన వర్గాలకు చెందిన దేవతలు ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ వంటి దేవతల ఉత్సవాలను జరిపించాడు. స్త్రీ దేవతలను ఆరాధించడం తన తల్లిపై వున్న ప్రేమను వ్యక్తం చేయడంగా చూడాల్సి వుంటుంది.

పాపన్న వ్యక్తిత్వానికి అద్దం పట్టే మరొక సంఘటన. రాజ్యకాంక్షతో బయలుదేరే ముందు తల్లిదగ్గర ధనాన్ని తీసుకోవడం, తండ్రి లేక పోవడంతో కుటుంబ భారం సర్వమ్మ మీద పడింది. పాపన్నకు వున్నతమైన గౌరవప్రదమైన జీవితం కల్పించడానికి సర్వమ్మ డబ్బును పొదుపు చేసింది. కష్టపడి పొదుపు చేసిన ధనాన్ని పాపన్న అడిగినపుడు యివ్వడానికి నిరాకరించింది. రాజు కావడానికి అవసరమయ్యే సైన్యం, ఆయుధాలకోసం తన యింట్లో ధనాన్నే తీసుకోవాలనుకున్నాడు పాపన్న. నిస్వార్థపరుడు కావడం వల్లే సొంత ఆస్తితోనే సైన్యాన్ని రూపొందించాలనుకున్నాడు. నిజంగా పాపన్న స్వార్థపరుడైతే తన ధనం జోలికి పోకుండా ముందుయితరులను కొల్లగొట్టాలను కొనేవాడు. పాపన్న తలపెట్టిన మొదటి ప్రయ త్నంలోని నిజాయితీని, స్వచ్ఛమైన మనసును అర్థంచేసుకోవడం వల్లనే మంచి స్నేహితులు ఒకచోట చేరారు. అందువల్లనే తన రాజ్యకాంక్షను, ఆశయాన్ని స్నేహితులతో చెప్పిన వెంటనే అంగీకరించారు. తాను అధికారం చేపట్టడానికి ముందు తన నుంచే సంస్కరణ మొదలు పెట్టిన ఆదర్శవంతుడు పాపన్న. జీవితం మొత్తం త్యాగశీలిగా, ధైర్యసాహసాలకు ముందుండి వెనుదీయని ధీశాలిగా నిలవడం వల్లనే పాపన్నను సర్దార్ పాపన్నగా ప్రజలు కొనియాడారు. తాను పెళ్లచేసుకోకపోవడం స్వంత ఆస్తిని యుద్ధానికి ఖర్చు చేయడం, తన ఆశయానికి సాటి అణగారిన కులాలను చేరదీయడం వంటివి పాపన్న సామాజిక చింతనకు ముందు చూపుకు నిదర్శనం.అణగారిన కులంలో పుట్టి, నిస్వార్థ జీవిగా, వీరునిగా, తరాలుగా జానపదుల్లో సజీవంగా నిలిచిన , పాపన్నవంటి మరొక తెలుగు వీరుడు చరిత్రలో కనిపించడు. పాపన్న వ్యక్తిత్వానికిచారిత్రక సాక్ష్యాలు కొన్ని.

పోతారం గ్రామానికి చెందిన బైండ్ల జియ్యరుకు క్రీ.శ.1676లో పాపన్న'పొగశెల్లకట్నం, జమిడిక' దానంగా ఇచ్చాడు. యీ జమిడిక మూడు శతాబ్దాల నుండి వీరిగాన,కళా ప్రావీణ్యానికే గాక, స్థానిక ఎల్లమ్మ పట్నాలు చేయడానికి సనదుగా లెక్కింపబడుతున్నది. యింకా వీళ్ల దగ్గర పాపన్న దానం చేసిన తామ్రపత్రం కూడా వున్నది. జమిడిక, పొగశల్ల కట్నం పొందిన బైండ్ల జియ్యరు యెల్లమ్మ గుడికి పూజారి.

యిదే కాలంలో మరొక పూజారి వీరమల్లయ్యకు కూడా 'పొగశెల్లకట్నం' పాపన్న బహూకరించాడు.

రహస్య జీవితం గడుపుతన్న పాపన్న కొంతకాలం వొంటరిగా ప్రయాణించవలసి వచ్చింది. అప్పటికే వెలమ దొరలు పాపన్నను యెదిరించలేక చెడు ప్రచారం చేశారు. పాపన్న గురించి తెలియని ప్రజలు ఆ పేరు వింటేనే భయపడేవారు. అలాంటి సమయంలో వొకనాడు పాపన్నదాహంతో వొక వూరికొచ్చాడు. చెడు ప్రచారం ద్వారా దొరలు ప్రజలను భయభ్రాంతులను చేయడం వల్ల ప్రజలు పాపన్నకు భయపడ్డారు. యీ సమయంలో మాల కులానికి చెందిన వొక స్త్రీముందుకు వచ్చి ధైర్యంగా పాపన్నను యింటికి ఆహ్వానించింది. పాపన్నకు యిష్టమైన కల్లును తెప్పించి పోసింది. దీనికి సంతోషించిన పాపన్న ఆ స్త్రీకి గౌరవంగా సుంకరి వృత్తిని యిచ్చాడు. నేటికీ సర్వాయి పేటలో ఈమె వారసులు సుంకరి వృత్తిని అనుభవిస్తున్నారు.

యింకొక సందర్భంలో యెల్లమ్మ పట్నాలకు మేపోతును యిస్తుంటే వున్నట్టుండి ఆ మేకపోతు బెదిరిపోయింది. యెంత మంది ప్రయత్నించినా అది దొరకలేదు. చివరికి ముత్రాసి ఎల్లయ్య మేకపోతును పట్టి తెచ్చి యెల్లమ్మ పూజకు భగ్నం కాకుండా చేశాడు. దీనికి పాపన్న సంతోషించి

ప్రతిఫలంగా దేవతగుళ్లో ఎల్లయ్యనే పూజారిగా నియమించాడు. ఇప్పటికీ ఎల్లయ్య వారసులు పూజారులుగా కొనసాగుతున్నారు. యిలా పాపన్న వ్యక్తిత్వాన్ని పట్టిచ్చే ఎన్నో చారిత్రక ఘటనలు వెలుగు చూడవలసి వున్నది. జీవితానుభవం నుంచి వచ్చిన జ్ఞానం పాపన్నది అగ్రకులాలకు వ్యతిరేకంగా పోరాడటానికి అణిచివేతకు గురవుతున్న అణగారిన కులాలను చైతన్యవంతం చేశాడు. కులాల వారీగా నాయత్వాన్ని రూపొందించి తానున ముందుండి నడిపించాడు. బ్రాహ్మణులను, అగ్రకులాలను యేనాడూ దరి చేరనివ్వలేదు. అందువల్లనే తాను అనుకున్నది సాధించగలిగాడు. రాజ్యాధికారం చేపట్టి రాజు అయ్యాడు.

# పాపన్నకు చరిత్రకారులు చేసిన ద్రోహం

పాపన్న చరిత్రను మహమ్మదీయులు, ఆంగ్లేయులు తమ రచనల్లో నిక్షిప్తం చేశారు. వీరు కాకుండా తెలుగులో అనేక మంది పరిశోధకులు, రచయితలు పాపన్న గురించి రాశారు. వీరిలో కొంతమంది జానపద కళాకారులను ఆశ్రయించారు. అందరికి అందరు పాత చరిత్రనను పరిశీలించి, విశ్లేషించారేతప్ప పాపన్న ఎలాంటి వాడో చెప్పలేకపోయారు. కారణం చరిత్ర రచనలో ఆధిపత్య కులాల గుత్తాధిపత్యం నాటి నుండి నేటివరకు కొనసాగుతుండటమే. పాపన్న చరిత్రను వక్రీకరించి రాయడానికి ప్రధానకారణం అణగారిన కులంలో పుట్టడమేనని చెప్పవచ్చు. ప్రధానంగా భారతదేశ చరిత్ర రచనలో బ్రాహ్మణుల ఆధిపత్యమే కొనసాగుతున్నది. అందువలన అణగారిన కులాల చరిత్రలు మౌఖికంగా జానపదుల కళారూపాలలో జీవించి క్రమంగా క్షీణించి పోయాయి. అణగారిన కులాల చరిత్రలను జానపదుల నుండి సేకరించి లిఖితరూపంలోకి తచ్చే ప్రయత్నాలు సరైన రీతిలో జరగగ పోవడంతో కాలానుగుణంగా అవి బ్రాహ్మణీకం చెందయి. యిప్పటి కళారూపాలలో బ్రాహ్మణీనరణ చెందని రూపం వొక్కటి కనిపించదు. అలాంటప్పుడు వీటి నుండి ఆయా కులాల వుత్తేజం పొందే అవకాశమే లేదు. అణగారిన కులాలకు ఈ ఎరుక లేకపోవడంతో యింత విపత్తు జరిగిపోయింది.

అనగారినకులాలు యిప్పటికైనా చరిత్రను సరైన కోణంలో పరిశీలించి వాస్తవాల్ని ముందు తరాలకు అందించ గలిగినప్పుడే ఆయా కులాల ఐక్యతను ప్రాతిపదికన ఏర్పడుతుంది. గత చరిత్రను పరిశీలించే ముందు వాటిని ఎవరు రాశారు?అంటే ఏ మతాలు-కులాల రచయితలు-ఏకులాలు, మతాలకు సంబంధించినవారి గురించి రాశారో తెలుసుకుంటేనే కాని వాస్తవికచరిత్ర వెలుగులోకి రాదు. యీ నిర్ధారణ వింతగా తోచవచ్చుకానీ వాస్తవంయిదే. భారతదేశ చరిత్ర రచన ఆసాంతం మహమ్మదీయులు, బ్రాహ్మణులు, లేదంటే వీరి ఆధిపత్యాన్ని అంగీకరించిన ఆంగ్ల చరిత్రకారుల ఆధీనంలో వున్నది. ముఖ్యంగా తెలుగుప్రాంతం యీ రకమైన ధోరణిలోనే కొనసాగింది. యిందుకు భిన్నమైన చరిత్రయెక్కడా (జానపదులలో తప్ప)కనిపించదు. సరిగ్గా సర్వాయి పాపన్నకు కూడాయిదే ద్రోహంజరిగింది. పాపన్న గురించి మహమ్మదీయ చరిత్రకానులు రాసింది తక్కువే అయినా దొంగ, బందిపోటని సత్యాన్ని వక్రీకరించారు. వీరి రాతలననుసరించే ఆంగ్ల చరిత్రకారులు సూత్రీకణలు చేశారు. యింకా ముందుకు నడిచి అసత్యాన్ని సత్యంగా ధృవీకరించే ప్రయత్నం చేశారు. వీరి ఉద్దేశాలను తెలుగు చరిత్ర కారులు విజయవంతంగా నెరవేర్చారు. కిందికులాలైన అత్యధిక ప్రజలు చరిత్రనను చూపే పద్ధతిని మార్చుకోకపోతే యీ పద్ధతిలో మార్పురాదు.

స్థానికంగా స్వతంత్రం ప్రకటించుకొని మొగల్ పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వీరులందరిని మహమ్మదీయ చరిత్రకారులు దొంగలు, బందిపోట్లుగా చిత్రించారు. 17వ శతాబ్దంలో మొగలు పాలకుడైన ఔరంగజేబును వొకచోట నిలునీయకుండా చేసి మరాఠా ప్రాంతాన్ని జాగృతం చేశాడు. శివాజీ, గోల్కొండ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకొని పాలించాడు పాపన్న. ఈ యిద్దరు వీరులను మహమ్మదీయ చరిత్రకారులు తమ స్వమతాభిమానంతో దొంగలు, బందిపోట్లుగా వర్ణించారు. వాస్తవాలను పరిశోధించకుండా మహమ్మదీయులు రాసిన గ్రంథాలనే ఆంగ్ల చరిత్రకారులు అనుసరించారు. దక్కన్ ప్రాంతంలో విదేశీ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన వీరుల గురించి అసత్యాలను ప్రచారం చేయగా, తమ అధిపత్యాన్ని పాపన్న చరిత్రను బ్రాహ్మణ చరిత్రకారుల అబద్ధాలను ప్రచారం చేసి మనుధర్మాన్ని తమ రచనల్లో కొనసాగించారు.

శివాజీని వీరునిగా, హిందూ సామ్రాజ్య నేతగా వర్ణించిన బ్రాహ్మణ చరిత్రకారులు పాపన్న విషయంలో వివక్షను పాటించారు. కారణం పాపన్న తానుయేలిన 20 యేళ్లలో యేనాడూ బ్రాహ్మణులను ఆదరించలేదు. ప్రత్యేక రాయితీలు వారికి ప్రకటించలేదు. కనీసం వారి పోషణకు దేవాలయాలు కట్టించలేదు. మడులు, మాన్యాలు ఇవ్వలేదు. అందుకే పాపన్న చరిత్రను వారు రాయలేదు. కొంతమంది రాసిన చరిత్రను వక్రీకరించావారు.

భారతదేశంలో అన్ని యుగాల్లోనూ బ్రాహ్మణుల ఆధిపత్యం ప్రత్యంక్షంగా, లేదంటే పరోక్షంగా సాగింది. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ఆమోదించని రాజ్యాలను దూషించి, లేదంటే చూసీ చూడనట్లు నటించి చరిత్రలో స్థానం లేకుండా చేశారు. అన్ని కాలాల్లోను చరిత్ర రచనలో మతాధిపత్యం చోటుచుసుకున్నది. అందువలన భారత దేశంలో మెజారిటీ ప్రజలు చరిత్రలో చోటు సంపాదించలేక పోయారు. ప్రజలను హింసించి పట్టణాలను, గ్రామాలను దోచుకున్నవారిని రాజులు చక్రవర్తులు, వీరులు, సామ్రాజ్యనేతలుగా వర్ణించగా తమను ఆదరించిని రాజులను చరిత్రహీనులుగా చిత్రించారు. కారణం చరిత్ర రచనా విధానమంతా మత, కుల ఆధిపత్యం పైనే ఆధారపడి కొనసాగింది.

తెలుగు ప్రాంతాన్ని పాలించిన వారందరూ సంపదను దోచుకుని , వేలమందిని చంపి ఆధిపత్యవాదులయారు. వీరందరూ వీరులుగా చక్రవర్తులుగా చలామణి అయ్యారు. యిదంతా ఆనాటి రాజనీతిలో భాగమంటారు కొంతమంది. మరి పాపన్న కూడా ఆనాటి రాజనీతిలో భాగంగా ధనవంతులను, ముస్లిం సర్దారులను, భూస్వాములనను దోచుకుని పేదప్రజలకు ముఖ్యంగా అణగారిన కులాలకు పంచిపెట్టాడు. పాపన్న చరిత్రలో ఎందుకు వీరుడు కాలేక పోయాడు? యీ రకమైన వివక్ష ఎందుకు చూపిస్తున్నారు?వీటికి సమాధానాలు చరిత్ర రాసిన వారు యెవరు?యే మతం, ఏ కులానికి చెందిన వారు అవి చూసి నప్పుడు దొరుకుతాయి. ఔరంగజేబు బ్రాహ్మణులను చేరదీయలేదు. కనుక అతని మీద వున్న కోపంతో పాపన్న గురించి రాశారే తప్ప వాస్తవాలను రాయాలనే ఉద్దేశంతో కాదు. తెలుగులో చరిత్రను రాసిన వారందరూ బ్రాహ్మణులన్నది గమనించాల్సిన విషయం.

స్వామి ధర్మతీర్థ ప్రకారం-

"ఒక జాతి నిర్మాతగా శివాజీకి ఎన్నో అద్భుతమైన లక్షణాలున్నాయి. మొక్కవోని ధైర్యంతో యుద్ధంచేయగల సైనికుడు, సైన్యాధ్యక్షుడు, తెలివైన పాలనాసమర్ధుడు. అయితే బాల్యంలో తన మీద పడిన బ్రాహమణ ప్రభావం నుండి ఎన్నడూ బయటికి రాలేదు. తన రాజ్యాన్ని బ్రాహ్మణుల పాతదాక్రాంతం చేశాడు. క్షత్రియత్వాన్ని ఆమోదించడం ద్వారా కుల వ్యవస్థను ఆమోదించాడు. బ్రాహ్మణులకు దివానులుగా పురోహితులుగా వుండే హక్కును గుర్తించాడు."

పాపన్న తన రాజ్యాన్ని బ్రాహ్మణుల పాదాక్రాంతం చేయలేదు. అందుకే వారు ఆయనకు స్థానం కల్పించలేదు. పొరపాటున, తప్పని స్థితిలో కల్పించినా పాపన్నను అవమానించారు. పాపన్న తన రాజ్యాన్ని అనగారిన కులాలకు శ్రేయోరాజ్యంగా మలిచాడు. వారి కోసం జీవించాడు. అందువల్లనే జానపదులు తమ మౌఖిక చరిత్రలో పాపన్నను వీరునిగా అనగారిన కులాల నాయకునిగా సజీవంగా తమ హృదయాలలో నిలుపుకున్నారు.

పాపన్న అగ్రకులాల మహమ్మదీయ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేశాడు. అన్ని రంగాల్లోనూ సాటి అణగారినకులాలకే ప్రాధాన్యత యిచ్చాడు. బ్రాహ్మణులనుదగ్గరికి చేరనివ్వలేదు. వారికి వ్యతిరేకంగా అణగారిన కులాల దేవతలను ప్రోత్సహించి, దేవాలయాలలో అర్చకత్వం కూడా అణగారిన కులాలకే అప్పగించాడు. అందుకే బ్రాహ్మణ చరిత్రకారుల చారిత్రక ద్రోహానికి, మహమ్మదీయులకు వ్యతిరేకంగా పోరాడి వారికి శత్రువయ్యాడు.

బ్రాహ్మణులు తమకు గుళ్లు కట్టించి, మాన్యాలు యిచ్చినవారిని, ధనం, బహుమానాలు పంచిన వారిని ఆకాశానికి ఎత్తి రాశారు. బ్రాహ్మణులను ప్రజలతో సమానంగా చూసి ప్రత్యేక రాయితీలు కల్పించని రాజులనను, రాజ్యాలను వారి చరిత్రలను వక్రీకరించి రాసిన చరిత్ర నిండా కన్పిస్తాయి. బ్రాహ్మణుల ఆధిపత్యా న్ని ఆమోదించని యే రాచరిక వ్యవస్థను కొనసాగనీయలేదని చరిత్ర రుజావు చేస్తున్నది. యీ పరిస్థితి నేటికీ కొసాగుతూ వుండడం దీనినే బలపరుస్తున్నది. అందుకనుగుణంగనే బ్రాహ్మణ, అగ్రకుల రచయితలు పాపన్నను 'వాడు'....'వీడు' అనీ బందిపోటు దొంగని, స్త్రీ లోలుడని అసత్యాలు ప్రచారం చేశారు. చేస్తున్నారు. యీ ధోరణిని అణగారిన కులాలకు చెందిన చరిత్రకారులు నిరసించారు. వీరి పక్షపాత వైఖరిని ప్రజలముందు నిలబెట్టారు. జానపద కళాకారుడు బి. రామరాజు గారు రాసినట్లు-

"గోరంతలు కొండతలు చేసి అతడిని మత పాక్షికదృష్టితో ముస్లిం చరిత్రకారుల మహాక్రూరునిగా చిత్రించారు"

"ఇంత దేశమును, ఇంతమంది పాలకులను గడగడలాడించిన వానిని కేవలము నీచునిగ, బందిపోటు దొంగయగు, క్రూరుడగు,మూర్ఖుడగు పాపడుగా వ్రాసినారు. అతని యనుచరులత్యద్భుతముగా తప్పించుకొ పారిపోవు ఘట్టములందు దొంగవలె మోసగాండ్రవలె పారిపోయినారనియు, సేనలు పరాభూతములై యోడిపోయి వెన్నిచ్చి వచ్చినప్పుడు కేవలము తిరిగి వచ్చెనను మాటలతో క్లుప్తపరిచినాడు. పాపని చేతిలో చనిపోయినవారిని, తురకలను వీరస్వర్గములంకరించిననియు, యుద్ధవిహతులైనారనియు గౌరవముగా చెప్పి, పాపని సైన్యము నాశనమైనారనియు, కోటగోడలు నేల మట్టమయయ్యెననియు చెప్పను. తురక సర్దారులనుభీమపరాక్రములుగా (రుస్తుమొసాని అనగా అపరరుస్తుములుగా) చిత్రించి పాపని దోపిడి దొంగగా చిత్రించారు. కనుక వీరి వ్రాతలు పాక్షికములుగా భావించవచ్చును". ఖఫీఖాన్ అనే మహమ్మదీయ చరిత్రకారుడు మొగలుల పాలనపై తిరుగుబాటు చేసిన వారందరిని దారి దోపిడీదారులుగా, క్రూరులుగా దొంగలుగా చిత్రీకరించి, ముస్లిం పాలకులను మాత్రం సామ్రాజ్యాధినేతలుగా, వీరులుగా రాశారు. యితని మతాభిమానానికి హద్దులు లేకుండా పోయాయి. చరిత్రను తన యిష్టానుసారంగా మలిచి, కట్టుకథలను ప్రచారం చేశాడు. ఖాఫీఖాన్ రాతలనే చాలా మంది చరిత్ర కారులు తమ రచనలకు ఆధారంగా తీసుకున్నారు. ఖన్ మహమ్మదీయేతరుల వీరత్వాన్ని సహించలేకపోయాడు. ఇతని తప్పుడు వక్రీకరణకు బలైన అనేక మందిలో శివాజీతో పాటు పాపన్న వొకరు. ఇతని పాక్షిక దృష్టిని డా. బిరుదురాజు రామరాజు పసిగట్టారు.


"ధనము కొరకు చరిత్రలో అక్కను, పదములో తల్లిని హింసించినట్లున్నది. తల్లినో, అక్కనో ఈ రీతిగా హింసించినా వాడట్టి క్రూరుడేయై యుండవలననుట మాత్రము సరికాదు. అతడు ధనమును కోరినది ఏ జూదమునకో, విలాసమునకో కాదు. సైన్యము కొరకు. రాజ్యకాంక్ష ఎంతలేసి పనులనైనను చేయించగలదు. చక్రవర్తులు, మహారాజులు రాజ్యముకొరకై, తండ్రులను కొడుకులు, కొడుకులను తండ్రులు, రాజులను మంత్రులు, దండనాథులు చంపి, చంపించిన ఘట్టములు ప్రపంచ చరిత్రమున పెక్కులున్నవి. వానియందిదియొకటి. కొల్లగొట్టుటయనునది ప్రతి బలము గల రాజు బలహీనుడగురాజుపై బడినప్పుడు చేసిన పనియే! చరిత్రయందున్నట్లు పాపడు శత్రురాజ్యములపై బడి కోటలు బొక్కసములు, ధనాగారములు కొల్లగొట్టియుండును. అంతేకాని దారిదోపిడిదారు మాత్రము కాడు. అది యాతని వృత్తి గాదు."

పాపన్న వీరునిగా, అణగారిన కులాలను ఆనాడే సంఘటితం గావించి ఆదిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి రాజ్యాధికారం చేపట్టాడు. పాపన్నను ఆదర్శంగా తీసుకొని గౌడ్కులం యేకం కాకుండా శత్రువు పన్నిన కుట్రలో చిక్కుకుని విలవిల లాడుతున్నది. నేటికీ చరిత్ర హీనులుగా చలామణి అవుతున్నది. కానీ పాపన్న జీవితంలో యేనాడూ శత్రువులకు చిక్కలేదు. చివరికి మరణంలో కూడా.

# పాపన్న చరిత్రకు సజీవ సాక్ష్యాలు




పాపన్న మొట్టమొదట కట్టించిన సర్వాయిపేట
కోట ముఖద్వారం (క్రీ.శ. 1675 ప్రాంతం)




కోట బురుజు (క్రీ.శ. 1675 ప్రాంతం)



కరీంనగర్‌జిల్లా హుస్నాబాద్‌లో ఎల్లమ్మ గుడి



తాటికొండ గుట్ట కింద నిర్మించిన రక్షణ
వలయం




కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో వూరి
నడుమ పాపన్న నిర్మించిన బురుజు



తాటికొండ గ్రామంలో గుట్టమీద
పాపన్నకట్టించిన రాతికోట



తాటికొండ గుట్ట మీది రక్షణ కోసం కట్టిన ప్రహరీ గోడ



పాపన్న ఆయుధ కర్మాగారంలో తయారైన మరఫిరంగి



కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో పాపన్న తన యిష్టదైవం ఎల్లమ్మకు చేయించిన పురాతన మట్టి విగ్రహం



తాటికొండ గుట్ట మీద పాపన్న నిర్మించిన కోట ముఖద్వారం




మరఫిరంగిని నిలిపే రాతి స్టాండ్



తాటికొండ గుట్ట మీద పాపన్న నిర్మించిన చెక్‌డ్యాం



ఖిలాషాపురం గ్రామంలో రాతికోట లోపలి ముఖద్వారం



ఖిలాషాపురం గ్రామంలో రాతికోట రహస్యమార్గం




ఖిలాషాపురం గ్రామంలో రాతికోటలో ఫిరంగుల ప్రయోగానికి అనువుగా నిర్మాణాలు



ఖిలాషాపురం గ్రామంలో రాతికోటలోవున్న నడిమి బురుజు

విక్టోరియా అల్‌బర్ట్ (లండన్ నుండి) జగదీష్ మిత్తల్ సేకరించిన నాటి పాపన్న సమకాలీకుడు వేసిన చిత్రపటం.









క్రీ.శ 1708 ఏప్రిల్ 1 న పాపన్న ఆక్రమించిన వరంగల్ కోట ముఖద్వారం

వరంగల్ జిల్లా చేర్యాల దగ్గర ధూల్మిట్ట గ్రామంలో వెలుగు చూసిన
పాపన్న శిల్పాలు






శిల్పం మీద చెక్కిన పాపన్న చారిత్రక ఆధారాలు


2003లోపాపన్న పుస్తకం హోం మంత్రి శ్రీ
తూళ్ల దేవేందర్‌గౌడ్ ఆవిష్కరించిన దృశ్యం